# నవయుగ

ఇందులో —


నేటి విద్యాసమస్యల పరిష్కారానికి విద్యార్థుల ఐక్యత నిర్మించాలి

ముష్టియుద్ధంలో ప్రపంచంలో దిట్ట జో లూయిస్

చదువుకోవాలంటే - సీట్లు లేవు

ఇల్లు దొరికింది !

స్టెర్లింగు నిల్వలు

వయోజన విద్య — యువజన సంఘాల కృషి

చైనా విద్యార్థుల పోరాటం

ఐక్య విద్యార్థి ఉద్యమ నిర్మాణమునకు పూనుకోండి

యువకులు - ఆరోగ్యం

పిల్లల నెలా పెంచాలి ?

తీగలు లేకుండా ఎలక్ట్రిక్ దీపాలు

చిటమిసులు





ఆంధ్ర విద్యార్థి యువజన

YOUTH UNITE! FORWARD FOR LASTING PEACE
WORLD FEDERATION DEMOCRATIC YOUTH

★ ★

మాసపత్రిక

# నవయుగ

ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి, యువజన మాసపత్రిక.

సంపుటి 1 | 1947 జూలై | సంచిక 5


## ★ సంపాదకీయం

# నేటివిద్యాసమస్యల పరిష్కారానికి విద్యార్థులఐక్యత నిర్మించాలి

రాష్ట్రమంతటా విద్యాలయాలు ప్రారంభమయాయి. వేసవి శెలవులను గడిపి విద్యార్థులు విద్యాలయాలకు వచ్చారు, ఇండ్లనుండి వచ్చిన విద్యార్థులందరినీ కల్లోలపర్చే సమస్యలు ప్రతి విద్యాలయంలో ప్రత్యక్షం

ఏ ప్రాంతమునుండి విన్నా సీట్ల కరువును గురించిన వార్తలే। గుంటూరు ఏ సి కాలేజీలో కొందరు విద్యార్థులు బి, యస్ సి కి సీట్లు కోరితే తత్వశాస్త్రంలో జేర్చుకోబడ్డారు గతసంవత్సరం ఆ స్కూలులో చదివిన విద్యార్థులకు గూడ తప్పారనే నెపంతో సీట్లు తిరస్కరింపబడుతున్నాయి. చల్లపల్లిలాంటిచోట్ల క్రింది క్లాసులకు అసలు పరీక్షలు పెట్టటమే మానుకుంటున్నారు. ఈసీట్లకొరత ఫలితంగా వందల, వేలమంది విద్యార్థులు విద్యాలయాల్లో జేరుటకు విద్యాలయాలచుట్టు ప్రదక్షిణాలు చేయవలసివచ్చుచున్నది రికమెండేషన్లకు పాటుబడవలసి వచ్చుచున్నది. ఈ అవస్థలు పడలేని బీదవిద్యార్థులు చదువుకే స్వస్తిచెప్పవలసివచ్చుచున్నది.

ఏదోవిధంగా సీటు సంపాదించి విద్యాలయంలో ప్రవేశించినా విద్యాలయాల్లో భరించలేనంతగా జీతాలు పెంచబడ్డాయి గవర్నమెంటు కాలేజి అన్నింటిలోను 25% జీతాలు పెంచారు హైస్కూళ్ళలో 10 వనెల జీతము ప్రవేశపెట్టబడింది ఇంతేగాక స్కూలుఫైనలు క్లాసుకు రు 5-4-0 వసూలు చేసే జీతము రు 7-4-0కు హెచ్చింపబడింది పరీక్ష తప్పిన విద్యార్థి ఇదివరలో రు 6-0-0 చెల్లించేవాడు నేడు అట్టి విద్యార్థులనుండి రు 8-0-0 వసూలు జేస్తున్నారు. ఇట్లే హైస్కూళ్ళలో యితర క్లాసులకు కూడ జీతాలు పెంచారు. వైద్య విద్యార్థుల జీతాలు 20% పెంచారు. పెంచగా వచ్చిన మొత్తంతో విద్యార్థులకు ఉచిత వేతనాలు యిస్తారట, ఎంత చక్కని కార్యక్రమం।

వీటినన్నిటిని మించినది-రాజకీయాలలో పాల్గొంటున్నారని, నిరుడు విద్యార్థులు సమ్మెలు జరిపారని నేర మారోపించి, అనేకమంది విద్యార్థి కార్యకర్తలను విద్యాలయాల్లో నిరంకుశ అధికారులు చేర్చుకొనక నిరాకరించుతున్నారు బందరు ప్రిన్సిపాలు 35 మందికి పైబడి సర్టిఫికెట్లు ఇచ్చి కాలేజినుండి పంపివేశాడు. ఆ విద్యార్థులు సర్టిఫికెట్లు చేత పుచ్చుకొని ప్రతి విద్యాలయముచుట్టు ప్రదక్షణము జేస్తున్నారు. ఎచ్చటా సీట్లు దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారు.

1947వ సం॥లో గూడ యీ నిరంకుశ విద్యాలయాధి కారుల దృష్టిలో విద్యార్థులు రాజకీయాలలో పాల్గొనుట, బానిస విద్యావిధానానికి వ్యతిరేకంగా సమ్మెలు నడుపుట గూడ మహాపరాధ మయింది

విద్యాలయాలలో నేడు పరిస్థితులిలాఉంటే అధికారంలోవున్న కాంగ్రెసు మంత్రివర్గం ఏమిచేస్తున్నది ? మంత్రివర్గము విద్యాసమస్యలను పరిష్కరించుటలో పూర్తిగా విఫలమయిందని చెప్పకతప్పదు సీట్ల వత్తిడి ఈ సంవత్సరము అతితీవ్రంగా యుండునని విద్యార్థి సంఘాలు సంవత్సరం నుండి హెచ్చరికలు జేస్తూయున్నా, మంత్రివర్గం ఈ హెచ్చరికలను పాటించలేదు చివరకు సమస్య నెత్తిపైకివచ్చిన పిమ్మట సీట్ల సమస్యను కృత్రిమంగా పరిష్కరించ దలచారు. అందుకు జీతాలను విపరీతంగా పెంచారు ఇందుచే బీద, మధ్యతరగతి విద్యార్థులు ఆర్థికబాధలచే చదువుకే స్వస్తిజెప్పుచున్నారు నేటికయినా విద్యాసమస్యల కెల్ల మూలకారణమైన బానిసవిద్యాపద్ధతికి స్వస్థిజెప్పుటకు తీవ్రప్రయత్నం చేస్తున్నట్లు కన్పించదు విద్యాపునర్నిర్మాణమునకు ఒక కమిటీని నియమించి ఆరునెలలు గడిచినా ఇంతవరకు ఈ కమిటీ ప్రాథమిక స్థాయిని దాటి అసలు సమస్యలోనికి దిగలేదు ఒకప్రక్క రాష్ట్రప్రజలు తీవ్రవిద్యాసమస్యలను ఎదుర్కొనుచుంటే విద్యామంత్రి మాత్రము కమిటీని నియమించుటతో కాలం వెళ్ళబుచ్చుచున్నాడు

నేడు విద్యాలయాలలో విద్యార్థుల నెదుర్కొను సమస్యలను పరిష్కరించుటకు విద్యార్థిసంఘాలు ముందుకు రావాలి మంత్రివర్గం యొక్క ధోరణిని మార్చుటకు విద్యార్థులలో ఐక్యత ఎంతేని అవసరం. నేటి సీట్లసమస్య పరిష్కరింపబడువరకు, నూతనంగా పెంచిన జీతాలను రద్దు చేయువరకు ప్రతిప్రదేశములోను విద్యార్థికాంగ్రెసు, విద్యార్థి ఫెడరేషన్ ఐక్యకార్యాచరణ సంఘాలు ఏర్పరచాలి. తలిదండ్రులను ఈ ఆందోళనను బలపర్చునట్లుగా సమీకరించాలి విద్యార్థులలో యిట్టి ఐక్యతను నిర్మింపగలిగినప్పుడే నేటి బానిస విద్యకు స్వస్థిజెప్పి, అచిరకాలంలో స్వతంత్ర విద్యాప్రణాళికలను మంత్రివర్గంచే అవలంబింపజేయగలం విద్యాలయాల్లో తక్షణం షిఫ్టుపద్ధతిని అమలుజరుపునట్లు, నూతన షెడ్డులను నిర్మించి కొత్తవిద్యార్థులను జేర్చుకొని సీట్లవత్తిడిని తగ్గించగలం. గత సంవత్సరం ఐక్యతతో వీరోచితంగా "డిటెన్షన్"కు వ్యతిరేకంగా పోరాడి జయించిన ఆంధ్రవిద్యార్థులు - నేటి సమస్యాపరిష్కారమునకు అత్యవసరమైన విద్యార్థిఐక్యతను నిర్మించుతారని ఆశించుతాము.

**ముఖచిత్రం జో లూయిస్**

## ముష్టియుద్ధంలో

# ప్రపంచంలో కెల్లదిట్ట - జోలూయిస్

2 లక్షల మంది నీగ్రో యువకులు ఆరోజున వీధులలో బారులుతీర్చి నిల్చొని జోలూయిస్ విజయవార్తకోసం ఎదురుచూస్తున్నారు బరువులెత్తటంలో జోలూయిస్ అనే నీగ్రో యువకుడు, బిల్ కాన్ అనే జాత్యహంకారముగల ఒక అమెరికన్‌తో పోటీ సల్పుతున్నాడు ఒక అరగంటలోనే జోలూయిస్ ('జో' అని అంటారు) విజయవార్త వచ్చింది వార్త వినటంతోనే విజయ నినాదాలు, బ్యాండు వాయిద్యాలు - ఒకటేమిటి - ఆమహానగరం అంతటా మారుమ్రోగాయి. వరల్డ్ ఛాంపియన్‌గా ఒక నీగ్రో యువకుడు నిలబడ్డాడు నీగ్రోజాతికిపేరు తెచ్చాడు నీగ్రోజాతికే కాదు, ప్రపంచంలోని నల్లజాతులందరికీ గౌరవం తెచ్చాడు అయితే, ఈ 'జో' ఎవరో, అతని చరిత్ర ఏమిటో తేలుసుకోవాలని కుతూహలంగా లేదూ ? ఇదిగో చెప్తా వినండి

అమెరికాలో లాఫ్‌యెట్టి అనే గ్రామంలో ఒక బీద నీగ్రో కుటుంబంలో పుట్టాడు చిన్నప్పటినుంచి బాక్సింగ్ (ముష్టియుద్ధము)లోనూ బరువులెత్తటంలోనూ చాలా ఆసక్తి కలిగియుండేవాడు అట్లాగే పట్టుదలతో నేర్చుకొన్నాడు.

1934లో బరువులు ఎత్తటంలో ప్రథమ బహుమతి పొందాడు బాక్సింగ్‌లో, అదే సంవత్సరంలో జాన్ క్రాకెన్ అనే అతనిని, మొదటి వరసలోనే తిప్పితిప్పికొట్టాడు ఈవిజయంతో అతను బాక్సింగ్‌ప్రపంచంలో పైకి వచ్చాడు.

ఇప్పటివరకూ 59 పోటీలలో (ఉచిత ప్రదర్శనలు కాకుండా) పాల్గొన్నాడు. ఎప్పుడూ అపజయమనేది ఎరుగడు ఓడిపోతాననే భయం మొదలేలేదు. ఇప్పటి వరకూ 30 లక్షలడాలర్లు ఆర్జించాడు

అతని వయస్సు 37 సంవత్సరాలు, 6' 1¾" పొడుగూ, 204 పౌన్ల బరువు సంగీతం అంటే చెవికోసు కుంటాడు.

కాని అతని జీవితంలో మొదటి సారిగా పోటీకి తలపడినపుడు ఓడిపోయాడు కాని "జో" అట్లా ఓడిపోవటమే మంచిదయింది. ఎందుచేత నంటే, అపుడొక విచిత్రమయిన సంఘటన జరిగింది.

అపుడు అతనికి 21 సంవత్సరాలు బాక్సింగ్‌లో అనుభవంలేదు మొదటిసారిగా మాక్స్ స్మెల్లింగ్ అనే జర్మన్ బాక్సర్‌తో పోటీ పడ్డాడు

ఈ పోటీలో 'జో' గట్టి దెబ్బతిన్నాడు. 12 రౌండ్లలో ఓడింపబడ్డాడు కాని ఇదే మొదటిసారిగాను, ఆఖరిఅపజయంగాను పరిణమించింది

మాక్సు స్మెల్లింగ్ పొందిన యీ విజయాన్ని నాజీలు "ఆర్యన్" జాతియొక్క ఆధిక్యతను తెలియజేయటానికి నిదర్శనమని రేడియో ద్వారా డబ్బా కొట్టుకున్నారు. నీగ్రోలంటే, నల్లవారంటే మానవులే కానట్లుగా మాట్లాడారు.

**వి. హనుమంతరావు**

మన 'జో' ఈ విషప్రచారాన్ని విన్నాడు తనజాతికి, తనవ్యక్తిత్వానికి సవాలుగా గ్రహించాడు జవాబు చెప్పటానికి సమయంకోసం ఎదురు చూస్తున్నాడు ఆ సమయం వచ్చి రావడంతోనే రింగ్ (పోటీకి ఏర్పరచబడిన ఒక వలయాకారస్థలం)లోకి దూకాడు అతని శరీరంలోని ప్రతి అణువుకూడా ప్రతీకారాన్ని కోరుతోంది. ఈసారి రింగ్‌లోకి వెళ్ళేటప్పుడు కేవలం వరల్డు ఛాంపియన్‌షిప్‌కోసంమాత్రమే కాదని, ఒక ఉత్కృష్టమైన ఆదర్శంకోసం పోరాడుతున్నానని మనస్సులో ఉంచుకొన్నాడు. ఈ పోటీలో అపజయమంటే తనకేకాదు తన నీగ్రోజాతి అంతటికీ ప్రపంచంలోని నల్లజాతులందరికీ అపజయమనే విషయాన్ని మరచిపోలేదు

అదే పట్టుదలతో, ఆదర్శంతో పోరాడినపుడు అపజయమనేది ఉంటుందా ? రెండే రెండు నిమిషాలలో మాక్సుస్మెల్లింగును తుక్కుక్రింద కొట్టాడు "ఉత్కృష్టమైన ఆర్యన్‌జాతి" వాదాన్ని మచ్చుకుకూడా కన్పడకుండా చేశాడు ఈవార్తవిన్న జర్మన్‌వాళ్ళ బుర్రలు భూమిలోకిదిగి పోయాయి

దాని తర్వాత, ప్రతీసారికూడా విజయలక్ష్మి ఇతన్ని వరిస్తూనే వచ్చింది. ఈ రోజున వరల్డ్‌ఛాంపియన్‌గా నిలబడ్డాడు. నీగ్రోజాతికంతటికీ గౌరవభిక్షను పెట్టి, వారి హక్కుల కోసం పోరాడుతున్నాడు 'జో'

ప్రస్తుతం యూరప్, ఆస్ట్రేలియా దేశాలలో ఎగ్జిబిషన్ టూర్ చేయటానికి బయలుదేరుతున్నాడు బాక్సింగ్ ప్రపంచంలోనుంచి వరల్డ్ ఛాంపియన్‌గా విరమించుదామని అతనిఉద్దేశం.

నల్లజాతుల గౌరవాన్ని నిలబెట్టిన జోలూయిస్ అతని 'ఎగ్జిబిషన్ టూర్'ను విజయవంతంగా ముగించుతాడని ఆశించుదాం

## విద్యార్థి డిటెన్యూలను విడుదలచేయాలి

అఖిలభారత విద్యార్థి కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్రవర్మ, అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అన్నదా శంకరభట్టాచార్య ఈ క్రింద ప్రకటన చేశారు.

మద్రాసు మంత్రివర్గం రామచంద్రన్, అమర్‌నాధ్, మోహనరెడ్డి, రామస్వామి, మొదలగు విద్యార్థి వర్కర్లను అరెస్టులు, డిటెయిన్ చేయటాన్ని మేము నిరశిస్తున్నాము అంతర్జాతీయ, విద్యార్థి సేవాదళము వారి ఆగ్నేయ ఆసియా మహాసభ ప్రారంభదినం నాడు మదరాసులో ఆ సభకు హాజరైన మోహన్ రెడ్డిని అరెస్టు చేశారు సామాన్యంగా ప్రతి గవర్నమెంటూ ప్రజారక్షణ వ్యతిరేక చర్యల నాపుటకు, శాంతిని కాపాడుటకు అన్ని హక్కులూ కలిగివుంటుంది కాని పోలీసు అఫీసర్లు పెద్ద ఎత్తున నిరంకుశ చర్యలు సాగిస్తుంటే ఆచర్యల అవసరాన్ని, గూర్చి కించిత్ కారణం చెప్పక పోవడం అరెస్టయిన వారిపై నేరాలు మోపి విచారణ, సౌకర్యాలు కల్పించక పోవటం పౌరసత్వ హక్కులను అణచటమే అవుతుంది. కాబట్టి మేము మద్రాసు మంత్రివర్గాన్ని ముఖ్యంగా విద్యాశాఖా మంత్రిని విద్యార్థి డిటెన్యూల నందరినీ విడుదల చేయించ వలసిందిగాను, కనీసం న్యాయ విచారణ జరుపుటకు పూనుకో వలసిందిగాను కోరుచున్నాము.

# చదువుకొందామంటే - సీట్లు లేవు

విద్యార్థులు నూతనసంవత్సరం విద్యార్థి జీవితాన్ని కొనసాగించుదామని అప్పో సప్పో చేసి ఆస్తులనుఅమ్మి విద్యాలయాలకు తయారైనారు ఇందులో కొంతమందికి విద్యాలయాలలో సీట్లు లభ్యమయ్యాయి కొంత మంది నిరాశతో విద్యకు స్వస్తిచెప్పారు కొంత మంది అధికారులచుట్టూ కాళ్ళుఅరిగేటట్టు ప్రదక్షణాలు చేస్తున్నారు ఈ అడ్మిషన్ సమస్య ఎంత తీవ్రతరంగా వున్నదో చూదాం

## సీట్లు లేవు

ప్రతి సంవత్సరం కొత్త విద్యార్థులకు సీట్లు దొరకటంలేదు కాని ఈ సంవత్సరం ప్రత్యేకత ఏమంటే ఆ స్కూలులో చదివిన విద్యార్థులకు కూడ సీట్లు లేవు ఎస్. ఎస్. ఎల్. సి. స్కూలుఫైనలు చదివి తప్పిన విద్యార్థులకు తమ స్కూలులో సీట్లు లేవని అధికారులు చెపుతున్నారు పామర్రులో 20 మార్కులకు తక్కువవచ్చి తప్పిన స్కూలుఫైనలు విద్యార్థులకు సీట్లు నిరాకరించుతున్నారు జగ్గయ్యపేటలో స్కూలుఫైనలు విద్యార్థులు 70 మంది అయ్యారు వీరు కొత్త పాకలకు ముడుపులు తప్పక చెల్లించవలెనట లేనిచో సీట్లు సున్న నర్సరావుపేటలో స్కూలుఫైనలు తప్పిన 37 మందిని తిరిగి స్కూలులో చేర్చుకోవటం లేదు ఇదేవిధంగా ఒంగోలులో 30 మందికి సీట్లు లేవు రెండు సెక్షన్లు చేయవలసి వస్తుందని గురజాల కొల్లూరులో విద్యార్థులను చేర్చుకోవటం లేదు కర్నూలులో లోయర్ ఫారం విద్యార్థులను చేర్చుకో నిరాకరించితే విద్యార్థులు ప్రజలు మున్సిపాలిటీని కదిపి కొత్తషెడ్డులు నిర్మించుతున్నారు ప్రవేశ పరీక్షలలో 'వడపోత' రాబోతూంది

ఇక కాలేజీలలో తనకు అభిరుచి వున్న గ్రూపులు యివ్వకుండా అధికారులు యిష్టం వచ్చినట్లు చేస్తున్నారు గుంటూరు ఎ సి కాలేజీలో సైన్సు గ్రూపులకు బదులు ఆర్ట్సు గ్రూపులకు సీట్లుయిస్తున్నారు ఆర్ట్సుఎక్కడ? సైన్సు ఎక్కడ? బెజవాడ కాలేజీలో విద్యార్థినులను చేర్చుకోవటంలేదు వీరు ఇతర చోట్లకు వెళ్ళవలసివచ్చింది ఎ సి కాలేజీలో అధమం విద్యార్థికి సీటు దొరికినా ఆర్థిక కష్టాలతో వున్న విద్యార్థులు వెంటనే జీతాలు కట్టకపోతే సీట్లు రద్దు అయినాయి ఇదంతా సైన్సు గారికి యితర విద్యార్థులకొరకు వచ్చిన రికమెండేషన్ మహత్యం కాబోలు। విద్యార్థులు గత సం॥ సమ్మెలలో పాల్గొన్నారనే కక్షతో పామర్రు నర్సారావుపేట పునాదిపాడు హెడ్ మాష్టర్లు విద్యార్థి సంఘ కార్యకర్తలను చేర్చుకోవటంలేదు ఇక బందరు సంగతి చెప్ప నవసరంలేదు 33 మందిని వెళ్ళగొట్టారు వీరు అనేక యిబ్బందులకు లోనవుతున్నారు పరీక్షలలో ఎక్కువమందిని తప్పించినప్పటికీ జీతాలు హెచ్చుచేసినప్పటికీ సీట్లకు అనేక నిర్బంధాలు నిర్ణయించినప్పటికీ విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది


మల్లవరపు రామక్రిష్ణారావు
కార్యదర్శి,
ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్



## సమస్య తీవ్రతకు కారణం?

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విద్యను ప్రజలకు అందుబాటులో లేకుండా సంకుచిత పద్ధతులలో విద్యావిధానాన్ని అమలుపర్చుతూ వచ్చారు కాని జాతీయోద్యమ ప్రభావంవల్ల విద్యయెడల యువకులకు కాంక్ష ఎక్కువైంది దీనితోబాటు సామ్రాజ్యవాదుల సంకుచిత పద్ధతులు చిన్నాభిన్నం కాలేదు బానిస విద్యను తుదముట్టించి, యువకులకు విద్యనుఅందుబాటులోకి తీసుకువచ్చే నూతన ప్రణాళికలులేవు అందుచే యీ సమస్య నానాటికీ తీవ్రరూపం పొందింది దీని ఫలితం భవిష్యత్తులో దేశపునర్నిర్మాణానికి కావలసిన విద్యా వసతులు లేకపోవటం పునర్నిర్మాణ కార్యక్రమాన్ని కుంటుబరచటం తప్ప మరేమికాదు దీని తీవ్రతనుగూర్చి మంత్రివర్గం ఆలోచించనైనాలేదు ప్రజలు మాత్రంఅచంచల దీక్షతో కృషిసాగిస్తున్నారు స్థానిక అధికారులకు సమస్యా పరిష్కారానికి మార్గాలు చూపుతున్నారు రాష్ట్రంలోనివిద్యార్థి ఉపాధ్యాయసంస్థలు ఈ విషయం చర్చించేందుకు జులై 13 న మద్రాసులో అంతర్జాతీయ విద్యార్థి సేవాసమితి శాఖ ఆధ్వర్యాన సమావేశ మవుతున్నారు।

నేడు విద్యార్థులను తలిదండ్రులను బాధించుచున్న యీసమస్యా పరిష్కారానికి యీదిగువ కార్యక్రమం అమలుపర్చాలి

(1) ఉపాధ్యాయుల జీతాలు పెంచి సంఖ్యను ఎక్కువచేసి సీట్లను పెంచాలి షిఫ్టు పద్ధతి ప్రవేశపెట్టాలి

(మిగతా 5 వ పేజీగో)




ఉన్న భారాలకు తోడు సీట్లులేవు, పైపెచ్చు అధిక జీతాలు.

చిన్న కథ

# ఇల్లు దొరికింది!

'విల్ మషోర్'

నోరీ, నెల్లీలు రెండు ప్రేమైకజీవులు. న్యూయార్కులో తమ అల్లారుముద్దు బిడ్డతో జ్యోతిర్మయజీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నారు. నోరీ న్యూయార్కులో పెద్ద ప్రభుత్వోద్యోగి. నోరీ వుంటున్న యింటియజమాని నుండి ఇంటికి గిరాకీ తగిలింది. నోరీకి యిది తెలిసింది. కాలుకాలిన పిల్లిలాగా తిరుగుతున్నాడు. కిటికీగుండా ఆకాశంలోకి చూస్తున్నాడు నిరాశతో. నెల్లీ మాత్రం దువ్వెన దుంపతెంచి తుమ్మెరీగలవంటి జుత్తును అదుపులోకి తెస్తోంది.

ఆనాటిరాత్రికి ఇంటిసమస్యను దీర్ఘంగా చర్చించారు భార్యభర్తలు. ఆచూకీ తెలిసిన ప్రతి ఇంటికీ ఫోనుచేసారు. అన్నీ నిరాశాపూరిత సమాధానాలే. ఇంకోమార్గం శోధించారు—పత్రికలో ఇల్లు కావాలని ప్రకటనలు—మంచిదంటే మంచిదని యిద్దరూ కూడబలుక్కున్నారు. చెరొకటి ప్రకటనలు పారేశారు ఇక ఇల్లుతప్పక లభ్యమవుతుందనే ధీమాతో.

ఎట్టకేలకు నాలుగు ఇళ్ళు బేరంలోకి వచ్చాయి అందులో రెండు ఇళ్ళు అమ్మకానికి. కందిపప్పు కావాలంటే, శనగపప్పు మంచిది వున్నదన్నట్లు – మూడో ఇల్లు నోరీ ఉద్యోగ తాహతుకు మించింది. పోగా నాల్గోది ఒక మోస్తరుగా వుంది. నోరీ, నెల్లీలు చూడడానికి కారులోబయలుదేరారు. వాళ్ళముఖాన సంతోషం తాండవిస్తోంది. ఇల్లు చేజిక్కిందనే ధీమాతో.

కారు ఆ గుర్తులుగల ఇల్లు చేరుకుంది. నెల్లీ ముందు, నోరీ వెనక ఇంటిలోకి బయలుదేరారు. ఇంటి యజమానురాలు దేవతలాగా ప్రత్యక్షమైంది. భార్యాభర్తలు ధన్యవాదాలర్పించారు.

ఉద్యోగ వైనాన్ని గూర్చి మొదటి ప్రశ్న వేసింది యింటి యజమానురాలు.

"సైనిక డిపార్టుమెంట్ ఆఫీసులో లాయర్"అని నెల్లీ సమాధానం చెప్పింది. ఇంతలోకి యజమానురాలి బుర్రలో ఏదో తొలిచింది "మీరు యూదులా? అవునుకదూ?"

"అవును" నెల్లీ.

"అయితే యిల్లు ఇవ్వబడదు" అని నిర్మొగమాటంగా చెప్పింది యజమానురాలు.

సంతోష తిమ్మెరలు ఆ భార్యభర్తల మొఖాలనుండి విషాద తెరచాటుకు తప్పుకొన్నాయ్. బరువెక్కిన రెండు హృదయాలు యింటికి చేరుకొన్నాయ్. ఇద్దరూ మూగనోము పట్టారు. యింటికి చేరుకున్నారు.

పై ఘటనను గూర్చి యింటివద్ద ఘాటుగా చర్చ సాగింది యూదులమని చెప్పరాదంటాడు నోరీ, "పాడు ఆదర్శం. సత్య సంధత. చేతులారా చక్కటి యిల్లు పాడుచేసావు" అన్నాడు నోరీ కోపదృష్టిని ప్రసారిస్తూ కఠినంగా.

'నోరీ' అంది ధైర్యంగా నెల్లీ. "ఇదిసత్య సంధతకు సంబంధించినదికాదు. ఇంగిత జ్ఞానానికి సంబంధించింది. అటువంటి గయ్యాళితో పది రోజులపాటు కాపరం చేయగలమా? పది రోజులకే ప్రయాణం కట్టాలి" అని చకచక వంటింటిలోకి పోయింది.

నోరీ శాంతంగా లోతుగా ఆలోచించసాగాడు. గబగబా వంటింటిలోకి పోయి భార్య భుజస్కంధాలపై చేతులువేసి "సరియైన పని చేసావు" అని తప్పుచేసిన వాడి మొఖం పెట్టాడు.

"అయితే నా హృదయం సంతోష సాగరములో ఓలలాడుతోంది" అంది తన నిర్దోషిత్వాన్ని చాటుతూ నెల్లీ క్రీగంటి చూపుతో.

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. ఆ ప్రేమజీవుల హృదయ వీధులలో రైళ్ళు దౌడు తీస్తున్నాయ్. యింటి సమస్య వాళ్ళ మనస్సును బాధించుతోంది. సాధ్యమైనన్ని పత్రికా ప్రకటనలిచ్చారు. అనేకమంది ఏజంట్లద్వారా ప్రకటించారు. పెద్ద పెద్ద కట్టడాలు న్యూయార్కులో ఆకాశాన్నంటుకుంటున్నాయ్, అనేక వందల యిళ్ళను గుత్తకు తీసుకున్న మహానుభావులున్నారు. కాని రెండు ప్రేమైక జీవులు - తమ అల్లారు ముద్దుబిడ్డతో - కాపురం చేయటానికి కరువైంది ఇల్లు. పక్షుల్లాగా వృక్షాలకింద నివసించాలేమోనని భయపడుతున్నారు. గడువు గుర్తు ఆ సున్నిత హృదయాలను సూదిపోట్లు పొడుస్తోంది.

ఎక్కడో అల్కాట్ సతి యిల్లు అమ్ముతూందని ఆచూకీ తెలిసింది. అప్పుతీసుకొని యిల్లుకొనటానికి నిర్ణయించుకున్నారు భార్యాభర్తలు యిక చేసేదిలేక. పోయి ఆ యిల్లు చూడగా పశువులకు అనువుగామాత్రం ఉంది.

తిరిగివచ్చి బుర్రలలో చిత్తుప్లానులు వేస్తున్నారు ఆ భార్యాభర్తలు. ఇల్లు దొరకకపోతే—నెల్లీ హృదయం కంపించింది. తన ప్రియుని వదలి ఏకాకిగా—ఎక్కడో—యిక ఆలోచించలేకపోయింది ఆ ప్రేమజీవి.

"ఉద్యోగానికి సలాం కొట్టి యింటికి పోయి హాయిగా వుందాం." అన్నాడు నోరీ నిరాశాదేవతను కౌగలిస్తూ.

"చక్కటి ఉద్యోగం—ఎక్కువ జీతం. ఎట్లా చేతులారా పాడుచేసుకోవటం" అంది నెల్లీ అనుమానపు పీనుగను పట్టుకొని వ్రేళ్లాడుతూ.

"పోనీ ఏమిత్రుని యింటివద్దన్నా పది రోజులపాటు తలదాచు కొందాం" అంది సమస్యాపరిష్కారాన్ని చిటికలో గోరుతో గిల్లేసినట్లు అమాయకంగా.

"పిచ్చిదానా! అద్దెకు యిళ్ళు దొరకటం గగనం. పోగాకాగా మిత్రుల యిళ్ళవద్దా? అసంభవం" అన్నాడు నిట్టూర్పుతో.

"భయపడకండి. యిల్లు తప్పక దొరుకుతుంది. ఏదో నాకట్లా అనిపిస్తోంది" అంది అధైర్యాన్ని దిగమ్రింగి.

ఒకనాడు నోరీ మిత్రుడు జాన్‌సన్, నోరీ నెల్లీలను విందుకు పిల్చాడు. విందు కుడుస్తూ నోరీ "మాకు యిల్లు దొరకలేదు. మా నెల్లీ మాత్రం భగవాన్‌తో రాజీపడిందల్లేవుంది. యిల్లు తప్పక దొరుకుతుందని ధీమాగావుంది" అన్నాడు. మిత్రుడు జాన్‌సన్‌తో హృదయ భారాన్ని మోయలేక.

"చాల్లెండి మన యింటిగొడవలు రేపి, మీ మిత్రుల సుఖాన్ని ఖూనీ చేయకండి" అంది నెల్లీ హెచ్చరికగా.

[illegible] యింది.
యింటికి చేరుకున్నారు భార్యాభర్తలు. విందులో పొందిన కులాసా యిసకలో నీరులాగా యింకిపోయింది. మామూలు యింటి సమస్య పైకుబికింది.

ఆ రాత్రంతా ఆవేదనతో - ఆదుర్దాతో కాలం గడుపుతున్నాయ్ రెండుజీవాలు. కాని పసికందు జిమ్ మాత్రం- ఈ ప్రపంచంతో నాకు సంబంధం లేదు. ఎందుకు బాధపడాలి- అన్నట్లు నిశ్చింతగా నిద్రపోతున్నాడు. భార్యాభర్తలకు నిద్ర పట్టటం లేదు. ఎట్లా పడుతుంది? ఇల్లు దొరకకపోతే ప్రేమైక జీవులు వేరైపోక తప్పదు. నిర్జన ప్రదేశంలో నిరాశతో చూస్తున్నాడు నోరీ. ప్రక్కనే నెల్లీ రాని నిద్రకోసం బాధతో ఎదురు చూస్తోంది.

గడువు వారానికి చేరుకొంది. వాళ్ళ మానసిక వీధులలో రైళ్లు 'ఫుల్ స్పీడ్'లో పరుగెత్తుతున్నాయ్. ఆరోజు పెందలకడే ఆఫీసు పని చేయలేక, పార్కుకి పోలేక, యింటికి చేరుకున్నాడు నోరీ. గుమ్మంలో కాళ్ళకు అడ్డంబడి "ఇల్లు దొరికిందా నాన్నా" అన్నాడు అల్లారు ముద్దు బిడ్డడు జిమ్. నోరీ సమాధానం ఏమిటి?

"లేదు" అని

"అయితే చెట్టు నీడనేనా" అని తిరిగి ప్రశ్నించింది చిరుహృదయం.

"పొద్దు పోతోంది. పోయి స్నానంచేయి" అని విషయాన్ని దారి తప్పించాడు నోరీ. భోజనంచేసి నిద్ర పోయాడు జిమ్. ఆ రాత్రి నోరీకి భోజనం రుచించలేదు. ఏదో కారమో, ఉప్పో కూరలో తక్కువ అయినట్లుంది. రెండు మెతుకులు కొరికాడు. నెల్లీతో కులాసా కబుర్లు పలకటంలేదు. బట్టలు మార్చుకొందామని "దర్జీవాని దగ్గరకు పోయిబట్టలు తెచ్చావా?" అన్నాడు ముక్తసరిగా.

"కొట్టు మూసేసివుంది" అంది నెల్లీ యింకా ముక్తసరిగా.

"అవును. పాపం దర్జీ పావెల్ అకస్మాత్తుగా చనిపోయాడు" అన్నాడు ఆవేదన, విచారాలతో మిళితమైన ముఖంతో నోరీ.

"అయ్యో! పాపం! పొట్టికురచమనిషి, చిలకముక్కువంటి ముక్కు, తనకు తనే మురిసిపోయేవాడు" అంది నెల్లీ విచారాన్ని వెలిబుచ్చుతూ.

"అయితే పావెల్ సతి యిక ఎక్కడ కాలం వెళ్ళబుచ్చుతుంది? పిల్లలున్నారా?" అని ప్రశ్నించింది హృదయంలో ఏదోగుప్త పరచి.

ఏమో? అన్నాడు నోరి.

"అయితే ఇల్లు అద్దెకిస్తుందేమో?" అని అడిగింది ఆదుర్దాను ముందుకు త్రోస్తూ.

"వాళ్ళచుట్టాలకో, స్నేహితులకో ఇస్తుంది ఇక్కడ. వుండకపోతే నీకు, నాకు ఎందుకు యిస్తుంది" అన్నాడు నిరాశతో.

"తప్పక యిప్పుడే బయలుదేరాలి" అని నోరీ చేయిపట్టుకొని లాగుతోంది.

"నీకేమైనా పిచ్చెత్తిందా? పావెల్ చనిపోయింది ఈ రోజు ఉదయమే" అన్నాడు నోరీ భార్యను మందలిస్తూ.

"పిచ్చే. యిల్లు దొరకకపోతే పిచ్చకాదూ? కుటుంబం చెట్టూపుట్టా పట్టుకుపోతే పిచ్చెక్కదూ? నాకు యిప్పుడు కావాల్సింది యిల్లు. బయలుదేరండి" అని ఖండితంగా చెప్పింది.

ఆలోచించి 'సరే'నని కారులో బయలుదేరారు. పావెల్ యింటికిపోయి నెల్లీ కాలింగ్ బెల్ బటన్ నొక్కింది ఆ రాత్రిపూట. గంట గణగణ మ్రోగింది. నిద్రాభంగమైనందుకు మండిపడుతూ ఒక లావుపాటి కొత్త స్త్రీ తలుపు తీసింది.

"పావెల్ సతి లేరండి" అంది నెల్లీ.

"లోన వున్నది. యిప్పుడు మీతో మాట్లాడలేని స్థితిలో వుంది" అన్నప్పటికీ, చొరవతో నెల్లీ లోనప్రవేశించింది ఇంటిదాహంతో. వాలుకుర్చీలో కూర్చొని కంటకారే అశ్రుబిందువులను పమిటిచెంగుతో తుడుచుకొంటోంది పావెల్ సతి. అతికష్టంమీద నెల్లీ గుర్తుపట్టింది.

"ఇకమీరు ఏవిధంగా ఎచ్చటకాలం వెళ్ళబుచ్చుతారు" అంది నెల్లీ?

"నేనామె సోదరిని. నాయింటివద్ద ఈగల్ రాక్‌లో వుంటుంది."అని చెప్పి నిలబడివున్న నెల్లీని బలవంతాన నెట్టటం ప్రారంభించింది కొంచం పిక్క బలంతో నిలదొక్కుకొని.

"మాకు అద్దెకు యిల్లు కావాలి" అని అన్నదో లేదో.

"అయితే అట్లా చెప్పండి. వారంరోజుల్లో యిల్లు ఖాళీచేస్తాం. మీకు కావాలిస్తే పుచ్చుకోండి" అంది నూతన స్త్రీ.

పావెల్ సతి "అయ్యో! దేవుడా! నిండు సంవత్సరంవుండి యిప్పటికి వెళ్ళవలసి వస్తోంది" అని ఏకధారగా ఏడవటం ప్రారంభించింది ఆయింటిని వదలి వెళ్ళలేక.

నోరీ నెల్లీలు, పావెల్ సతికి సానుభూతి తెలియ పర్చారు.

నూతన స్త్రీ యిల్లంతా చూపెట్టింది. సరే మొత్తం మూడువందల డాలర్లలకు ఖాయం చేసుకొన్నారు.

"ఒక నెలఅద్దె అడ్వాన్సుగా యిస్తేనే ఖాయం." అని మడతపేచీ పెట్టనారంభించింది నూతన స్త్రీ.

వెంటనే జేబునుండి మూడువందల డాలర్లు తీసి లెక్కపెట్టి యిచ్చాడు నోరీ.

"ఫర్నిచర్ అంతా వుంటుందిగదా!" అన్నాడు నోరీ.

"ఇంకానయం, పాపమని ఇల్లుయిస్తే ఫర్నిచర్‌కూడ కావాలంట. అదికుదరదు" అంది నిర్మొహమాటంగా.

సరే ప్రతిదానికీ తలొగ్గారు నెల్లీ, నోరీలు. అవసరాన్నిబట్టి అన్నిటినీ అంగీకరించాలి.

ఇదిగూడా పెద్దవిజయంగా భావిస్తూ సంతోషముతో ఇంటికి పోతున్నారు. నెల రోజులతర్వాత వాళ్ళమొఖాన నేటికీ సంతోషం రాజ్యం చేస్తోంది.

[ 'మెంబస్ స్ట్రీమ్' అను అమెరికను సాహిత్య పత్రికలోని కథకు అనుసరణ. స్థలాభావంచే క్లుప్తీకరించబడింది. ]

అనుసరణ :

పర్చూరి కోటేశ్వరరావు.

---

(3 వ పేజీ తరువాయి)

(2) కాలేజీలలో సెప్టెంబరు తరగతులు పెట్టాలి.

(3) తాత్కాలిక భవనాలు నిర్మించాలి.

(4) దేశ పునర్నిర్మాణాని కత్యవసరమైన టెక్నికల్, వైద్యం మొదలగు కోర్సులను తక్కువ కాలపరిమితితో ప్రారంభించాలి.

## మంత్రివర్గ కృషి

ప్రజామంత్రివర్గంవచ్చి 14 మాసాలుపూర్తి అయినప్పటికి, విద్యా సమస్యలను పరిష్కరించలేకపోయింది. బానిస విద్యావిధానమును వెంటనే మార్చి, విద్యాభివృద్ధికి చేసిన కృషి ఏమీలేదని చెప్పకతప్పదు. సమస్యలు నెత్తిపైకి వచ్చిన సలహాదారు కమిటీలతోను, దీర్ఘకాల స్కీములతోను కాలం గడిచిపోతోంది. ఎన్నిసార్లు ఆలోచించినా సామ్రాజ్యవాదుల విద్యావిధాన చట్టంలోనే ఆలోచించటమే. ప్రజామంత్రివర్గం ఇప్పుడున్న బానిస విద్యావిధాన స్వరూపంలోనే ప్లాను ఆలోచించితే మన విద్యావిధానాన్ని ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించలేం. నూతన ప్రణాళికలు అమలు పర్చేటప్పుడు, సామ్రాజ్యవాద పద్ధతులను కూకటివేళ్ళతో పెల్లగించాలి. అప్పుడే సమస్యల పరిష్కరించగలం.

# స్టెర్లింగు నిల్వలు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

రెండుదేశాలమధ్య వ్యాపారం జరిగేటప్పుడు ఒక దేశానికి యింకొకటి అంతో యింతో బాకీ ఉండటం జరుగుతుంది. అందులో ఒకటి బ్రిటను లాగా పాలించే దేశము, రెండవది ఇండియా లాగా బానిసదేశము అయినప్పుడు బానిస దేశము ఋణగ్రస్తమై యుండటం సహజం. యుద్ధానికి పూర్వం మనదేశం బ్రిటనుకు చాలా బాకీపడిఉంది.

కాని యుద్ధం ప్రారంభమై పూర్తిఅయ్యే సమయానికి జరిగిందేమిటంటే బ్రిటను ఋణం పూర్తిగా తీరటమేగాక, బ్రిటను మనదేశానికి రమారమి 1600 కోట్ల రూపాయలు బాకీపడి కూర్చుంది. "వందసంవత్సరాలకైనా మీబాకీ తీర్చలేము," అని బ్రిటిషువారు మనతో మొర పెడుతున్నారు.

ఇంత కొద్దికాలంలో బ్రిటను మన కింతగా ఋణపడటానికి కారణమేమిటి? ప్రపంచంలో కల్లా భాగ్యవంతమైన దేశాల్లో ఒకటి అయిన బ్రిటనుకంటే మనదేశం అకస్మాత్తుగా భాగ్యవంతమైపోయిందా? అప్పు సాంతం తీర్చుకోలేమనే బ్రిటనుకు, మనం ఎటువంటి జాలి చూపవచ్చు? ఈ విషయం తెలుసుకొనుట అత్యవసరం.

## స్టెర్లింగు నిల్వలు ఎలా ఏర్పడ్డవి?

ఈఅప్పు ఇంతగా పెరిగిపోవటానికి రెండు కారణాలు: (1)యుద్ధం జరిగిన ఏడు సంవత్సరాలలోను మనం పూచికపుల్ల ఖరీదు వస్తువులు కూడా పుచ్చుకోలేదు. మనవేపునుంచి వస్తువు లిస్తూ వచ్చాం. అందుచేత బాకీ తీరటమనేది జరగనేలేదు. (2) యుద్ధాని కవసరమైన సామగ్రీ, సహాయము మనవల్లపొంది, దానికిగాను బ్రిటను మనకు ఋణపడింది. ఇది మనం బ్రిటనుకు చేసిన సహకారం. ఇది మొదట్లో అంత జాస్తిగా లేదుగాని, జపాను యుద్ధంలో దిగిననాటినుంచీ, అంటే 1942 లగాయతు పాపం పెరిగినట్లు పెరిగిపోయింది. న్యాయంగా ఈ యుద్ధం ఖర్చు మనం భరించు కోవలసిందే. మనకు స్వాతంత్ర్యం వుండినట్లయితే దాన్ని జపాను ఫాసిస్టులు దోచుకోకుండా వుండగలందులకు మనం మన ఖర్చుతో యుద్ధ ప్రయత్నం సాగించి వుండేవాళ్ళం. కాని బ్రిటను మనకా అవకాశం ఇవ్వలేదు. మన దాస్యాన్ని తనవద్దనుంచి జపాను వారూ, జర్మనీవారూ లాగుకోకుండా వుండగలందులకు మన సంరక్షణ భారం బ్రిటను తన నెత్తిన వేసుకుంది. అందుకే యింత అప్పయింది.

బ్రిటనుకు యింత అప్పు పెట్టి నందుకు మనకు ఒరిగిన దేమిటి అని ఆలోచించాలి. ఈ యుద్ధ ప్రయత్నంలో మనకు క్రొత్త పరిశ్రమలు స్థాపన కాలేదు సరికదా, పాత పరిశ్రమలు కొన్ని పూర్తిగా విలిచి పోయాయి. జీవితావసరాల వుత్పత్తి యుద్ధ సహకారానికే సరిపోవటంవల్ల తిండీ, గుడ్డా మొదలైనవి అందకుండా పోయాయి. యుద్ధ ప్రయత్నంలో అధిక సంఖ్యాకులు పనిచేసి వేతనాలు పుచ్చుకోవటంవల్ల డబ్బు చలామణీఅధికమయింది. దేశంలో డబ్బు చలామణీ అధికమయిపోయి జీవితావసరాలు తరిగిపొయ్యేసరికి రూపాయి విలువ క్షీణిస్తుంది. దేశంలో తిండి కరువొచ్చింది. గుడ్డకరువొచ్చింది. అంటువ్యాధులు రెచ్చి పోయాయి. మందులు లేవు. దొంగ వ్యాపారులు విజృంభించారు. దేశంలో భీకర పరిస్థితులు యేర్పడ్డాయి, బెంగాలులోను, బీహారులోను కేరళలోనూ, వరిస్సాలోను, రాయలసీమలోనూ మృత్యు దేవత తాండవించింది. అంగట్లో అన్నీవుండి అల్లుడి నోట శని అన్నట్లు ఎక్కడో బ్రిటనులో మన పేర కోట్లకుకోట్లు డబ్బు పెరుగు తున్నది. మనం మటుకు చితికిపోయాం.

## సామ్రాజ్యవాదుల కుట్రలు

యుద్ధం అయిపోతూనే బ్రిటిషు వారు దబ్బగవేసే ధోరణి ప్రారంభించారు. తమ దగ్గిర అప్పంతా పుచ్చుకోవటం ధర్మం కాదన్నారు. డబ్బు చలామణీ పెరిగి పోవటం వల్ల ధరలు పెరిగి ఇంత అప్పయింది గాని న్యాయమైనధర ప్రకారంచూస్తే యింత అప్పు వుండదన్నారు. కాని ధరలు పెరగటానికి కారణం తాము అప్పుపేరబెట్టుట యేనని వారు చెప్పరు. ఎప్పటి కప్పుడు మన అప్పుకు సరిపడా వస్తువులు బ్రిటను సప్లయి చేసినట్లయితే ధరలింతగా పెరిగి వుండవు.

మనను కాపాడటానికే యీ ఋణం చేశామని యిప్పుడంటున్నారు. కాని మనకు స్వాతంత్ర్యం యిచ్చేసినట్లయితే మనను మనమే కాపాడుకునే వాళ్ళం. కొన్ని ముఖ్య కీలక పరిశ్రమలు నెలకొల్పుకునే వాళ్ళం. యుద్ధం అయిపోయేసరికి మన ఆర్థికజీవితం మనం చక్కబెట్టుకుని వుండేవాళ్ళం. ఇంగ్లండు, కెనడా, ఆస్ట్రేలియా మొదలయిన స్వతంత్ర దేశాలీవిధంగా పరిశ్రమలను పెంచుకున్నాయి. మనం ఇంతా త్యాగంచేసి, స్టెర్లింగు నిల్వలు యింతగా చేర్చుకొని అధోగతిలోనే వున్నాం.

బ్రిటను మనకింకొక ద్రోహంకూడాచేసింది. బ్రిటనులాగే అమెరికాగూడా మనకు ఋణపడింది. ఈ ఋణానికి సరిపడా మనం అమెరికానుండి వస్తువులు తెచ్చుకొనే అవకాశం బ్రిటను యివ్వకుండా వుంది. ఈ అప్పును బ్రిటను ఋణంక్రింద మార్చుకొని మనం వినియోగపరచుకోవాలి.

(మిగతా 10వ పేజీలో)




లక్షలకొలది భారతీయులు కరువుకాటకాలకు ఆహుతి అవుతుంటే, చర్చిల్ ముఠా మన స్టెర్లింగు నిల్వలను ఎగగొట్టచూస్తోంది.

# వయోజనవిద్య : యువజనసంఘాల కృషి

మనదేశంలో నూటికి 12 మంది మాత్రమే అక్షరాస్యులున్నారు. అందువల్ల ప్రతి అభివృద్ధి కాముకుడూ ప్రతి ప్రజాసంఘమూ అక్షరాస్యుల సంఖ్య పెరగాలని, విజ్ఞానప్రచారం కావాలని ఆందోళనపడుట జరుగుతూంది. నిర్మాణ కార్యక్రమాన్ని వివరిస్తూ గాంధీజీ వయోజనుల విద్యావశ్యకతను యీ విధంగా వెలిబుచ్చారు: "కాంగ్రెసువాదులెవరూ వయోజన విద్యనుగూర్చి పట్టించుకొనుట లేదు. చెప్పినచోట్ల నిశాసీదార్లకు చదువను, వ్రాయను మాత్రం నేర్పి సంతృప్తి పడుతున్నారు. నేనే వయోజన విద్యా బోధనకు సర్వాధికారినైతే వయోజన విద్యార్థులకు ముందు వారి దేశము యొక్క ఔన్నత్యాన్నిగూర్చి చెప్పి, వారికి హృదయ వికాసాన్ని కలుగచేస్తాను. నా అర్థంలో వయోజన విద్య అంటే వాగ్రూపమైన, నిజమైన రాజకీయ విద్య."

### ప్రజాసంఘాల పాత్ర

మన ఆంధ్రదేశంలో వందేమాతరం ఉద్యమం రోజులలోనే యీ వయోజన విద్యా ఉద్యమము మొలకెత్తింది. దేశంలో జాతీయోద్యమం బలపడినకొద్దీ విద్యా వ్యాప్తి అభివృద్ధి చెందింది. మన ప్రజలలో విద్యా ప్రబోధం కలిగించుటకు అనేకమంది విద్యాభిలాషులు, విద్యార్థులు ముందుకొచ్చారు. ఆంధ్ర గ్రంథాలయం, దక్షిణ భారత వయోజన విద్యా సంఘాలు, యితర దేశాల వయోజన విద్యా ఉద్యమాన్నిగూర్చి ప్రజలలో విరివిగా ప్రచారం చేశాయి. గత 10 ఏండ్లనుండి విద్యార్థి, యువజన సంఘాలు, నడపిన రెండు రాజకీయ వేసంగి పాఠశాలలు ప్రజలలో నూతన వికాసాన్ని గల్గించాయి.

వయోజన విద్యా పితామహులు శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఆంధ్ర గ్రంథాలయ మహాసభలో "నేనెంతో కాలమునుండి ఆశించిన వయోజన విద్య ఉద్యమరూపంగా నేడు చూడగల్గుతున్నాను. నేనాశించిన ప్రచార సాధనాలనన్నింటినీ మీరుపయోగిస్తున్నారు. ఇందులకు ముఖ్యంగా కృష్ణాజిల్లా యువజనులు అభినందనీయులు" అని యువజన సంఘాలు వయోజన విద్యపై జరిపిన కృషిని అభినందించారు.

### యువజన సంఘ పాత్ర

లోగడ ఉద్యమ ఫలితంగా వచ్చిన అనుభవాన్ని స్వీకరించి, ఉద్యమ వ్యాప్తిలో ఉత్సాహమున్న యువజనులను సమీకరించి ప్రచార శిక్షణ యివ్వబడింది. వయోజనుల మనస్తత్వానికనుగుణ్యంగా "మా పాఠాలు" 1, 2 భాగాలు "మన పాఠాలు" అచ్చొత్తించింది.

వై. వి. కృష్ణా రావు,
కార్యదర్శి,
కృష్ణాజిల్లా యువజన సంఘం.

వ్రాయను, చదువను నేర్చిన వారికి హాస్యకథలు, రాజకీయము మొదలగు వివిధ రకాల పత్రికలతో రీడింగు రూములు ఏర్పాటు చేయబడ్డాయి. దిన,వార క్రమంగా మేగఫోనులద్వారా వార్తలు చెప్పబడుతున్నాయి. ప్రజా సమస్యలు నాటక, బుర్రకథ, విచిత్ర వేషాలద్వారా చిత్రించబడుతున్నాయి. అందుచే అనేక గ్రామాలలో గొడ్లకాపరులు మందలను బయటికి తోలుకొని వెళ్ళినప్పుడు ఏ చెట్టు నీడనో కూర్చుని రాత్రి పాఠాలను, వార్తా పత్రిక ముక్కలను తీసి కూడబలకటం, చదవటం, "అన్నా చదువు కొనగరావన్నా" మొదలగు పాటలు పాడటం చూడగలం. పిచ్చికొలతలు, తప్పుడు లెక్కలతో తమను దోచుకొంటున్న స్వార్థపరుల అవసరం లేకుండా, తమతమ కష్టార్జితాన్ని వందలకొలది యువకులు స్వయంగా లెక్కలు చూచుకోగల్గుతున్నారు. జూదాలు, త్రాగుడుల కాలవాలమైయున్న గ్రామ సీమలలో నేడు రీడింగురూములు, భజన సమాజాలు, ఆటలు మొదలగు వాటిలో వందలకొలది యువజనులు పాల్గొంటూ, పై దురభ్యాసాలనుండి బయటపడగల్గారు. రాత్రి బడులలో చదువుటలో తర్ఫీదు పొందిన వారనేక పల్లెలలో రీడింగు సెంటర్లు నడుపుతున్నారు. సమాజములో నీచంగా చూడబడుతున్న స్థితినుండి బయటపడుటకు (చెరువులనుండి, బావులనుండి నీళ్ళను తీసుకుపోవటం మొదలగునవి) తమతోటి బాధితులను సంఘటితపరుస్తూ, సమాజ ఉన్నతస్థితికి తీసుకొస్తున్నారు. ఏ మూడునాల్గు తరగతులలో చదివి మర్చిపోతున్న యువజనులు, పెద్దలనేకులు తిరిగి వయోజన విద్యా పాఠశాలలద్వారా, రీడింగు రూములద్వారా విద్య నభ్యసించటం, రాజకీయాలను చర్చించటం జరుగుతూంది. మొత్తంమీద పట్టణాలలో పల్లెలలోను విద్యా చింతన కేమాత్రం అవకాశంలేని వయోజనులకు వారల రాజకీయాభివృద్ధికి రాత్రిబడుల కేంద్రాలయాలద్వారా 840 మంది యువకులకు తర్ఫీదు నిచ్చింది. 2 వేలమంది దాదాపుగా ఉపన్యాసాల నర్థం చేసుకోవడం, వార్తాపత్రికలను చదవటం, వినగల్గటం అలవాటు పడ్డారు. తమజీవితంలో చదువురాదని నిస్పృహయున్న వయోజనులకు విద్యనేర్పి వారిలో ఆశాజ్యోతిని మొలకెత్తించటం జరిగింది.

ఒకప్పుడు రాత్రిబడులకు హాజరవటం అంటే బద్ధకించేవారు, నేడు వేలకు వేలు హాజరగుటకు సిద్ధంగా ఉన్నారు.

(మిగతా 12 వ పేజీలో)



కొలవెన్ను యువజనసంఘ గోడవార్తాపత్రిక.
ఫోటో : యం. రాఘవయ్య

## విద్యార్థి హక్కుల రక్షణకు

# ఐక్య విద్యార్థి ఉద్యమ నిర్మాణానికి

యస్. వి. నరసయ్య

నూతన సంవత్సరం విద్యాలయాలు ప్రారంభమయ్యాయి విద్యార్థులను అనేక నూతన సమస్యలు ఎదుర్కొంటున్నాయి రాజకీయంగా దేశంలోని ప్రజాశక్తులకు సామ్రాజ్య వాదులు లొంగి అధికారాన్ని హస్తగతం జేస్తామని ప్రకటించినా భారతదేశ ఆర్థిక పెత్తనాన్ని సామ్రాజ్యవాదులు తమ గుప్పిటలలో అట్టిపెట్టు కొనుటకు కృషి జేస్తున్నారు సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద కుట్రలను భగ్నం జేయుచూ రోజురోజుకూ దేశంలో పెంపొందుచున్న ప్రజా పోరాట వెల్లువకు జడిసి, జాతీయ నాయకత్వంలో ఒకభాగం సామ్రాజ్య వాదుల కుట్రలను భగ్నపర్చుటకు బదులు రాజీపడుటకు సంసిద్ధులవుతున్నారు సామ్రాజ్య వాద వ్యతిరేక సాంప్రదాయాలతో ఉద్భవించిన విద్యార్థి ఉద్యమం నేటి సామ్రాజ్యవాద కుట్రలను జాతీయ నాయకత్వంలోని ఒక వర్గపు రాజీ పంధాను భగ్న పర్చుటకు ఐక్యమవవలసి యున్నది

### విద్యా విషయాలు

ఇక విద్యాలయాల విషయాలు ఆలోచించితే షరీకరోర సమస్యలు ప్రత్యక్షం దేశంలో విద్యా వ్యాప్తికి ప్రణాళికలు తయారుజేసిన కాంగ్రెసు మంత్రివర్గం అధికారంలో యుంది కాని మధ్యతరగతి బీద విద్యార్థులను నేటి విద్యాలయములనుండి బయటికి కొట్టునట్లు జీతములు పెంచుట జరిగింది ఉన్న జీతాలే హెచ్చని ప్రజా సామాన్యం తమ బాలబాలికలను విద్యావంతులు చేయుటకు సంరక్షకులపైబడే విద్యా ఖర్చులు తగ్గించవలయునని కాంగ్రెస్‌సంస్థ పదే పదే ప్రకటించియుండగా కాంగ్రెస్ మంత్రివర్గం జీతాలు పెంచారు రాష్ట్రంలో ప్రతి విద్యాలయంలోను సీట్ల సమస్య అతిక్లిష్టస్వరూపం దాల్చింది ఉపాధ్యాయుల కోర్కెలను అంగీకరింపకపోవుటచే తగినంతమంది ఉపాధ్యాయులు విద్యాలయాలలోలేరు నూతనంగా రావలసినంతమంది ఉపాధ్యాయులు వృత్తికి పూనుకొనుటలేదు అందుచే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి షిఫ్టు పద్ధతిని విద్యాలయాలలో ప్రవేశపెట్టుటద్వారా నేటి సీట్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేకపోయింది

బానిస విద్యావిధానమునకు స్వస్తిచెప్పి జాతీయ విద్యావిధానమును అమలుపర్చ కంకణము కట్టుకొనిన కాంగ్రెస్ మంత్రివర్గం అధికారంలో యుండగనే — బానిస విద్యా నిర్మూలనను, డిటెన్‌షన్‌లకు వ్యతిరేకంగా పోరాడారనే నెపంతో అనేకమంది విద్యార్థులు విద్యాలయాలలో ప్రవేశించతిరస్కరింపబడుతున్నారు నిరంకుశ విద్యాలయాధికారులు తమ పెత్తనాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్నారు

ప్రతిప్రదేశంలోను జీవితపరిస్థితులు గగ్గరంగా వున్నాయి నామక? అద్దెకంట్రోలు చట్టమున్నా — విపరీతమైన అద్దెలు విద్యాలయాధికారులకు విద్యార్థుల జీవితాలనుగురించిన ఆలోచనే శూన్యం పట్టణాలలో నెలకు 30 రూ లు ఖర్చుపెట్టినా సరియైన తిండి శూన్యం ఇక గుడ్డకొరకు విద్యార్థులు పడే అవస్థలు వర్ణింపపనిలేదు

నేటి విద్యార్థి యిన్నిసమస్యలను ఎదుర్కొనవలసియుంది పై సమస్యల పరిష్కారమునకు తన శక్తికొలది కృషిసల్పుటకు ప్రతి ఆంధ్ర విద్యార్థి సిద్ధంగా నున్నాడు ఈ సమస్యల పరిష్కారమునకు ముందుండి ఆందోళనను నడపవలసిన విద్యార్థిసంస్థలు ఎందుకు కలసి పనిజేయలేకపోతున్నాయా అని ప్రతి విద్యార్థి కలవరపడుచున్నాడు డిటెన్‌షన్‌లకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు నడిపిన ఆంధ్ర విద్యార్థులు యింత తీవ్రసమస్యలు తమ్మెదుర్కొనుచుండగా ఎందుకుకలసి కృషిసల్పరని ప్రశ్నిస్తున్నారు

### విద్యార్థి ఐక్యత

పై సమస్యల పరిష్కారమునకు, విద్యార్థులలోని అభిప్రాయభేదాలను మరచి వివిధ రాజకీయపక్ష విద్యార్థులు కలసి పనిజేయుట అత్యవసరమని ప్రతిఒక్కరు గుర్తించుతున్నారు కాని విచారకరమైన విషయమేమంటే ఆంధ్ర విద్యార్థి కాంగ్రెసు నాయకత్వానికి యీ మార్గం రుచించుటలేదు వీరు తమ రాజకీయ విభేదాలనే ప్రధానంగా పాటించి విద్యార్థి సమిష్టి ప్రయోజనాలు మరచిపోతున్నారు కనుకనే పెచ్చు అఖిలభారత విద్యార్థి కాంగ్రెసు నాయకత్వం అనుభవంలో ఐక్యతా వ్యతిరేకపంధా తమకు లాభం చేకూర్చదని గుర్తించరు. ఇంతకాలం ద్వేషంతో దూరంగానుండిన పైనాయకత్వం విద్యార్థి ఫెడరేషన్ అంతర్జాతీయ యువజన సమాఖ్య అంతర్జాతీయ విద్యార్థి సమితిలో జేరనేడుప్రయత్నించుచున్నారు కొద్దిరోజులక్రితం మద్రాసులో జరిగిన దూరప్రాచ్య దేశాల విద్యార్థి సహాయ సమితి సభలో విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులతో కలసి పనిజేశారు ఇట్లే పంజాబులో విద్యార్థి హక్కులకొరకు పోరాడుటకు రాష్ట్ర ఐక్యకమిటీ ఏర్పరచారు బెంగాలు మలబారు ప్రాంతాలలో అనేక ముఖ్య సమస్యలపై కలసి విద్యార్థి కాంగ్రెసు-విద్యార్థి ఫెడరేషన్ సంస్థలు కృషిజేస్తున్నాయి కాని మన ఆంధ్ర విద్యార్థికాంగ్రెసు నాయకులకు యివేవీ రుచింపలేదు

చివరకు ఆంధ్ర జీవితంనుండి గూడ పాఠములు నేర్చుకొనదల్చలా మన విద్యార్థి కాంగ్రెసు నాయకత్వం విరుడు విద్యార్థి ఫెడరేషన్‌లో కలవ వద్దని నాయకత్వం తాఖీదులు పంపింది కాని డిటెన్‌షన్‌లపై పోరాడాలనే విద్యార్థి కాంగ్రెస్ కార్యకర్తలలోని చైతన్యం విద్యార్థి ఐక్యతను నిర్మింపజేసింది నాయకత్వం యొక్క ఐక్యతా వ్యతిరేక తాఖీదులు బుట్టదాఖలా చేయబడ్డాయి నిగడు యీ పరిస్థితులు మన ఆంధ్ర జీవితంలో జరిగినా - తిరిగి ఐక్యకార్యాచరణను విద్యార్థి కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించుతునే యున్నారు జూలై 10 విద్యార్థి హక్కుల దినం క్రింద, అధిక జీతాల

# పూనుకొండి!

వసూళ్ళను ఖండించుటకు సభలు, ప్రదర్శనలు జరుపుటకు ఐక్యతతో ముందుకు రమ్మని ఆహ్వానించినా, అనేక చోట్ల విద్యార్థి కాంగ్రెస్ నాయకత్వం విద్యార్థి ఫెడరేషన్ ఆహ్వానాన్ని తిరస్కరించింది.

## నాయకత్వంకొరకు పోటీలు

విద్యార్థి ప్రయోజనాలను కాక, రాజకీయ ద్వేషాలను ప్రధానంగా తీసుకొను పంథాను విద్యార్థి కాంగ్రెస్ నాయకత్వం అనుసరించ బట్టే నేడువిద్యార్థి కాంగ్రెస్ ముఠా రాజకీయాల తోను, తగువు లాటలతోను నిండియుంది. ఆంధ్రలో వేసవి సెలవులలో విద్యార్థికాంగ్రెసు రెండు కక్షలక్రింద చీలుట జరిగింది. ఈ చీలికల వెనుక వ్యక్తిగత తగువులాటలు, ముఠా రాజకీయాలు మినహా ఎట్టి రాజకీయ భేధాభిప్రాయాలూ లేవు. విద్యార్థి సామాన్యం యొక్క శ్రేయస్సునుకోరి అభిప్రాయ భేదాలేర్పడ్డ సమస్యేలేదు. ఇరుపక్షాల నాయకత్వం, విద్యార్థి ఫెడరేషన్‌తోకలసి పనిజేయుటకు వ్యతిరేకులే!

అఖిల భారత విద్యార్థి కాంగ్రెస్ నాయకత్వం యీచీలికలలో కలుగజేసుకొని తాత్కాలికంగా రెండు వర్గాలమధ్య రాజీ చేయుట జరిగింది. కాని యీ చీలికలకు మూలమైన వ్యక్తిగత గుద్దులాటలు మాత్రం సమసిపోలేదు. నేటి విద్యార్థి కాంగ్రెస్‌లోని ఐక్యత పైచూపులకు మాత్రమే. ఇరు పక్షాలూ రానున్న ఎన్నికలకు తయారవు తున్నాయి. ద్వేషాలు పెంచు తున్నాయి.

## కర్తవ్యం

విద్యార్థి కాంగ్రెస్ నాయకత్వం తమలోని కక్షలన్నింటినీ విద్యార్థులలోనికి, ముఖ్యంగా విద్యార్థి కాంగ్రెస్ కార్యకర్తలలోనికి, వ్యాపింపజేసి తమ నిరుపయోగ ఐక్యతా వ్యతిరేక పంథాను కప్పిపుచ్చుకొన ప్రయత్నిస్తున్నారు. నేటి విద్యా సమస్యల పరిష్కారమునకు ఐక్యతను గోరే ఏ విద్యార్థీ యీ ముఠా రాజకీయాలలో చిక్కుకొనజాలడు. ఈ నాయకత్వంయొక్క ముఠా రాజకీయాలకు స్వస్తి జెప్పి. విద్యార్థి ఐక్యతను నిర్మించినప్పుడే విద్యార్థి సమస్యలను పరిష్కరించగలం. అందుకు విద్యార్థులను ఎదుర్కొనుచున్న

[illegible]

స్థానికంగా ఐక్యకార్యాచరణ సంస్థలను ఏర్పరచవలసియున్నది. ఈఐక్యసంస్థల అజమాయిషీతో సామ్రాజ్యవాద కుట్రలను భగ్నపర్చుటకు, జీతాల హెచ్చింపును రద్దుజేయుటకు, యితర విద్యా సమస్యల పరిష్కరించుటకు, పోరాడవలసి యున్నది. అప్పుడే కాంగ్రెస్ మంత్రివర్గం మన సమస్యలు పరిష్కరించునట్లు జేయగలం. మన తలిదండ్రుల సహాయసానుభూతులను పొందగలం. స్వాతంత్ర్య సమరంలోను, జాతీయ విద్యా ప్రణాళికల నిర్మాణంలోను మన పాత్రను నిర్వహించిన వాండ్లమవుతాం.

నిరుటి సంవత్సరం మనం నిర్మించిన విద్యార్థిఐక్యతను ముందుకు కొనిపోయి, నేడు విద్యార్థిలోకాన్ని ఎదుర్కొనుచున్న వివిధ సమస్యలను పరిష్కరించుటలో ఆంధ్రవిద్యార్థి లోకం వెనుకబడదని ఆశించుతాం. విద్యార్థి ఐక్యతానిర్మాణములో ఆంధ్రవిద్యార్థులం మన పాత్రను మనం జయప్రదంగా నిర్వహించగలమని రుజావు పర్చుదాం.

---

(6 వ పేజీ తరువాయి)

## దేశ పునర్నిర్మాణమునకు స్టెర్లింగులే ఆధారం

న్యాయంగా, సవ్యంగా యీ ఋణం బ్రిటను సాధ్యమైనంత త్వరలో మనకు తీర్చినట్లయితే, మనం ఇదివరలోపడ్డ కష్టాలేవోపడ్డా, ఇప్పుడు మనం యీ స్టెర్లింగు నిల్వలతో మన ఆర్థికపరిస్థితిని చక్కబెట్టుకోగలం. మనదేశంలో బ్రిటిషువారి పెట్టుబడులు 500 కోట్ల రూపాయల విలువగలవి వున్నాయి. వీటిని మనం కొంత అప్పుక్రింద స్వాధీనం చేసుకోవచ్చు. మిగతా డబ్బుతో మనకవసరమైన మనపరిశ్రమలకుగాను అమెరికానుంచి, బ్రిటనునుంచీ తదితర దేశాలనుండీ యంత్రసామగ్రి కొనుక్కోగలం. ఈ విధంగా నెలకొన్న భారతీయ పరిశ్రమలు పెట్టుబడిదార్లతో సంబంధం లేకుండా ప్రభుత్వపరమై ఉంటాయి. ఈ విధంగా మనకీస్టెర్లింగు నిలవలు వుపకరించటం బ్రిటిషు సామ్రాజ్యవాదుల కిష్టంలేదు. వారి అభిప్రాయం — వీలైతే వీటిని వాతాపిజీర్ణం చేసుకోవాలని, ఇవ్వటం తప్పనిసరి అయితే యిందులో ఒకవంతే యిచ్చి మిగతాది కాజేయాలని. అదికూడ మనకు పనికివచ్చే యంత్ర సామగ్రి రూపంలోగాక వాడుకవస్తువులుగానూ అదైనా చాలా కొద్దికొద్ది మొత్తాలుగా చాలా కాలంమీదటనూ యివ్వాలని.

[illegible]

ఇక్కడ అమెరికా సహాయం బ్రిటనుకు కొంతవస్తున్నది. ప్రస్తుతం అమెరికా యిండియాతో పెద్ద వ్యాపారం సరాసరి సాగించుట లేదు. అందుచేత ఇటీవల అమెరికా బ్రిటనుతో ఒక ఆర్థిక ఒడంబడిక చేసుకొన్నది. దీనిప్రకారము 15 జులై 1947 నాటికి అమెరికా ఇండియాలమధ్య బ్రిటను పెత్తనం తొలగిపోతుంది. ఆనాటినుండీ అమెరికా మనకు సరుకులు పంపుతుంది. ఈ విధంగా అమెరికా తన స్వార్థం చక్కబెట్టుకుని ఆపైన స్టెర్లింగు నిల్వల విషయంలో బ్రిటనుకు సహాయంగా వస్తుంది. బ్రిటనుకు అమెరికాకు జరిగిన పై ఒడంబడిక ప్రకారం స్టెర్లింగు నిల్వల వ్యవహారంకూడా తేలిపోవాలి. అంటే బ్రిటను 15 జూలైలోగా తన బాకీ యావత్తూ తీర్చాలనికాదు; అందులో యెంత తీర్చేదీ! యెంత యెగవేసేదీ! ఇచ్చే మొత్తం ఎంతకాలంమీద యిచ్చేది తేలిపోవాలని! బ్రిటను తన బాకీలో మూడోవంతు ఎగవేసేటట్టూ, మిగిలిన దానిలో 50 సంవత్సరాల పాటు కొద్ది వడ్డీమీద తొక్కిపట్టేటట్లూ, అమెరికా దీనికంతకూ ఆమోదించినట్టూ తెలుస్తుంది. బ్రిటనులోని ఆర్థిక రాజకీయ వేత్తలూ, ఆర్థిక వ్యాపార పత్రికలుచేసే అలజడిసూస్తే స్టెర్లింగు నిల్వలు మన కెందునా వుపకరించకుండా చూడాలనే ధోరణిలోవున్నట్టుస్పష్టమవుతుంది. వారు నియమించే షరతులకు వప్పుకోకపోతే వారు మన బాకీ సాంతం బిగబడతామనిగూడా బెదిరిస్తున్నారు. బ్రిటను ధోరణి చూస్తే వారీ బాకీ చెల్లించే పద్ధతికీ, ఎగవేసే పద్ధతికీ అట్టే తేడా కనిపించడంలేదు.

ఈ 15జులైలోగా ఈ నిల్వలనుగురించిమన ప్రతినిధులు లండను సమావేశములో తీవ్రమైన అలజడిచేసి మనకు అనుకూలంగా పరిష్కారం చేసుకు రావటం ఎంతయినా అవసరం. మనమే మాత్రం అజాగ్రత్త వహించినా దొంగలూ దొంగలూచేరి వూళ్ళు పంచుకుంటారు. మన రక్తంధారవోసి ఆర్జించిన ఈనిల్వలు గాలిలో యెగిరిపోతవి. రేపు కొత్తరాజ్యాంగంలో మన దేశం ముక్కచెక్కలైపోయి, దేశమంతటా స్వతంత్ర ప్రభుత్వాలు నెలకొల్పి బ్రిటిష్‌వారి స్టెర్లింగు నిల్వల పంపకందగ్గిర మళ్ళా మనలో మనకు జుట్టూ జుట్టూ ముడిపెట్టడం ఉండనే వుంటుంది. కాని ప్రస్తుతం జూలై 15 గడువు లోపుగా స్టెర్లింగు నిల్వల పూర్తి పరిష్కారమూ, శీఘ్ర పరిష్కారమూ, స్థిరపడటం అత్యవసరం.

అంతర్జాతీయ

# యువజనోత్సవాలు

— ఎ. కె. ఆర్. బి. కోటేశ్వరరావు

ప్రతి దేశంలోని యువకుల దృష్టి నేడు ప్రాగ్ నగరం మీద కేంద్రీకృతమైవుంది. జులై 20 నుండి ఆగస్టు 17 వరకక్కడ జరుగనున్న అంతర్జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనే వివిధ దేశాల యువకుల కార్యకలాపాలను గూర్చి, ఆ దేశాల ప్రజల సంస్కృతి, కళా రూపాలు మొదలైన వాటివి గూర్చి తెలుసు కోడానికి కుతూహల పడుతుంటారు. రంగు, భేదం మతభేదం, జాతిభేదమనేది లేకుండా సర్వమానవ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, ప్రపంచ శాంతి అభ్యుదయాలను అభిలషించే యువజన ప్రతినిధులు - 60 దేశాల వారక్కడ సమావేశ మౌతారు.

## ఎన్ని అవాంతరాలున్నా

ఒకప్రక్క ఫ్రెంచి సామ్రాజ్యవాదులు నెత్తి మీద బాంబులవర్షం కురిపించుతున్నా, మరో ప్రక్క ప్రయాణం ప్రాణాంతకంగా పరిణ మించినా వీట్ - నామ్ యువజనులు తమ ప్రతినిధులను పంపనిశ్చయించారు. రాజీ అంటూ రాయబారాలు నడుపుతూ వెనుక యుద్ధ రంగాలను సృష్టిస్తూ డచ్చి సామ్రాజ్యవాదులు ఇండోనీషియనులకెన్ని ఆటంకాలు పెడు తున్నా ఇండోనీషియా ప్రతినిధులు పాల్గొన బోతున్నారు. ప్రభుత్వము, పరిస్థితులెంత వ్యతి రేకంగా వున్నా నిరుత్సాహపడకుండా ఇరాన్ యువకులు సాధ్యమయితే వస్తామని వార్త పంపారు.

## కళావేత్తలు, స్వాతంత్ర్య యోధులు

ఫాసిస్టు వ్యతిరేక రణరంగాల్లో ముందు నిలబడి వీరోచిత ప్రతిఘటన సాగించిన బాల్కన్, రష్యన్ దేశాల యువ ప్రతినిధులు, సామ్రాజ్య వ్యతిరేక పోరాటాల్లో కాకలుతీరిన ఆసియా, మధ్య ప్రాచ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటారు. యుద్ధ ఫలితముగ సర్వనాశన మయిన దేశాల్లో పునర్నిర్మాణ కార్యక్రమాలకు నాయకత్వం వహించిన ప్రతినిధులచ్చట తమ కార్యక్రమ వివరాలను ప్రదర్శిస్తారు. మతకలహపు విషజ్వాలల్లో సైతం ఐక్య పోరా టాలు నడిపి విజయాలు సాధించి మతకల హాలు రెచ్చగొటే బ్రిటిషుపాలకుల నివ్వెర పర చిన భారతవిద్యార్థి ప్రతినిధులు పాల్గొంటారు. రంగుభేద మయినంత మాత్రాన ప్రజాస్వామిక రక్షకులమని డబ్బాగొట్టే అమెరికను సామ్రాజ్య వాద పాలనలో నీచంగా చూడబడుతున్న నీగ్రో సోదరులు తదితర జాతులతోపాటు సమానహోదాలో పాల్గొంటారు. బద్ధవిరోధు లైన అరబ్బులు, యూదుయువజనుల ఐక్య ప్రతినిధివర్గం ప్రప్రథమంగా ప్రాగ్ చేరు కుంటోంది. ఆటంశక్తి పరిశోధనంలో ప్రసిద్ధి గాంచిన శాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్ బోర్, ప్రఖ్యాత నీగ్రో గాయకుడు కెన్నెత్ స్పెన్సర్, భారత కార్మికనాయకులైన డాంగే మొదలగుప్రముఖులు వివిధసమస్యలమీద ఉపన్యసిస్తారు. పండిట్ నెహ్రూకుకూడ ఆహ్వానం పంపబడింది. కాని రాజకీయ పరిస్థితులవల్ల రాలేక పోతున్నా నని భారతదేశము ఆ ఉత్సవాలయెడ సాను భూతి కలిగియుందని నెహ్రూసందేశంపంపారు.

## మన దేశ స్థానం

ఆటల్లోను, పాటల్లోను, నటనలోను, వక్తృ త్వంలోను, రచనలోను, నృత్యంలోను ఒకటే మిటి సమస్త కళల్లోను ప్రసిద్ధి కెక్కిన యువ ప్రతినిధులు షుమారు 50 వేల మంది అచ్చట సమావేశ మౌతారు. అఖిలభారత విద్యార్థి ఫెడ రేషన్ ప్రతినిధులుగా సత్యపాల్ డాంగ్, విమల ఒక్కాలు, సోవియట్ మిత్ర మండలి తరపున కుమార సాహిత్య మండల్ లు యీ ఉత్సవాలకు హాజరవుతున్నారు. యూరపులో ఉన్న భారతీయులొక వంద మంది నచ్చటకు పంపడానికి భారతవిద్యార్థి సంఘాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. భారత దేశం బ్రిటిషు సామ్రాజ్య పాలనలో యే విచ్ఛిన్న స్థితిలో వుందో "స్టాలిన్‌గ్రాడ్ యూత్ మెమో రియల్‌కు పంపడానికై సేకరించబడిన భారత దేశ స్థితిగతుల తెలిపే ఫొటోలు మొదలైనవి యిచ్చట ప్రదర్శింప బడతవి. ఆ వుత్సవాల్లో "కార్మిక, కర్షక, యువజన సమస్యలు, యువ కుల స్వాతంత్ర పోరాటం' "విద్యా సమ స్యలు" మొదలైన వివిధ సమస్యలమీద చర్చలు జరుగుతాయి. అందులో విద్యా విష యక సమస్యలమీద చర్చలను ప్రారంభించే గౌరవం భారత దేశాని కివ్వబడింది.

ఈ ఉద్యమమంతా 96 గ్రామాలలో 110 రాత్రి బడులద్వారా 2400 మందిలో ప్రచారం జరిగింది. ఇందులో 86 పల్లెలలో 1860 మంది హరిజనులు హాజరయ్యారు. వీటి కండగా 35 రీడింగు రూములు, 60 గ్రామ వైజ్ఞానిక దళాలు, 20 మెగఫోను సెంటర్లు ఒక్క జిల్లాలోనే కనబడు తున్నాయి.

ఇంకను అనువైన సాహిత్యం, పరికరాలు మొదలగు సౌకర్యాలు లభిస్తే ఇంకెంతో ఉద్యమం పెంపొందడాని కవకాశ ముంది.

## ప్రజా మంత్రుల కర్తవ్యం

ప్రభుత్వ బడ్జెటులో ప్రతి సంవత్సరము కొద్ది మొత్తం లేబర్ నైట్‌స్కూళ్ళు మొద లగు వాటికి గ్రాంట్లివ్వబడుతోంది. కాని ఈ గ్రాంట్లు పొందే వుపాధ్యాయులు, పాఠశాలలు ఏ మాత్రం శ్రద్ధవహించడం లేదు. ప్రభుత్వం వయోజన విద్యా ప్రచారానికి ఖర్చుపెట్టు ధనం నిరుపయోగం కాకుండా చూడాలి.

1937 లో బీహారు కాంగ్రెసు ప్రభుత్వం వుపాధ్యాయులకు గౌరవభృతినిచ్చి వుత్సాహ పరచి రాత్రి బడులను పెట్టించింది. వివిధ రకాల వార్తాపత్రికలను, పుస్తకాలను, ఛార్టు లను వుచితంగా సప్లయి చేసింది. దీని ఫలి తంగా రెండు లక్షలమంది ప్రజలలో విద్యా ప్రచారం చేయగలిగింది.

ఉపాధ్యాయులలో సంఘచైతన్యం పెంపొం దింది. అనేకసంస్థలు, వ్యక్తులు ముందుక వచ్చి వయోజనవిద్యా వుద్యమమును నిర్మిస్తు న్నారు. ప్రభుత్వం బాధ్యతవహించి వివిధ సంస్థల సహకారాన్ని తీసుకొనిన లక్షలకొలద ప్రజలు అక్షరాస్యులు కావడానికి సందేహం లేదు. ఉపాధ్యాయుల కోర్కెలు గుర్తించ గౌరవవేతనాల నేర్పరచి రాత్రిబడులు గ్రామ ములలో ఉపాధ్యాయులు నడుపునట్లు చేయాలి ఈ పాఠశాలలకు పత్రిక లుచితంగా సప్లయ చేయాలి. ఈ మార్గమును అనుసరించినపు వయోజన విద్యావుద్యమవ్యాప్తికి ప్రభుత్వ న్యాయం కలుగజేసినట్లు.

## యువతీ యువకుల కర్తవ్యం

మనచుట్టూ నూటికి 88 మంది సోదరీ సో రులు విద్యావిహీనులైయున్నారు. వారం అజ్ఞానంలో మునిగియున్నపుడు మిగిలి మనం చేయగలిగింది బహుస్వల్పం. కాబ చదువుకొన్న ప్రతివొక్కరూ తమకున్న విజ్ఞ నాన్ని యితరులకు అందజేయాలి. కనీస తీరిక సమయాన్నైనా యిందుకుపయోగించా

# యువకులు - ఆరోగ్యం


శ్రీ కొల్లి రంగదాసు చౌదరి

డైరెక్టర్ శ్రీ కోడి రామమూర్తినాయుడు స్మారక యోగవ్యాయామ ప్రకృతి చికిత్సాలయం.


శ్రీ కొల్లి రంగదాసుగారు వ్యాయామ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కృషిసల్పారు. ఆసనాలు, బార్బెల్సు మున్నగు విషయాలపై ప్రత్యేక పరిశోధనలు జరిపారు. వ్యాయామ విషయాలపై కృషిసల్పిన ఆంధ్రులలో సిద్ధహస్తులు. యువకుల ఆరోగ్యాభివృద్ధికి తోడ్పడు సూచనలిస్తూ ముందు ముందు వారి వ్యాసాలను ప్రకటించుతాం. మన దేశ ఆరోగ్య పరిస్థితులను వివరించు భాగం యిచ్చట ముద్రిస్తున్నాం. — సంపాదకుడు.

"ఆరోగ్యమే మహాభాగ్య" మను సామెత ననుసరించి ఆరోగ్యమును గురించి తగు శ్రద్ధవహించుట ప్రతి మానవుని విద్యుక్త ధర్మమైయున్నది. కాని మనదేశములోమాత్రం ఆరోగ్యమును గురించి శ్రద్ధవహించువారు వేయింట ఒకరైనను లేరని చెప్పుటయం దతిశయోక్తి యెంతమాత్రమును కాదు. దీనికి ముఖ్యకారణము ప్రభుత్వము తగు శ్రద్ధ వహింపకపోవుటయే. లోగడ పరప్రభుత్వము శ్రద్ధవహింపలేదనుకొన్నను, ప్రస్తుతము అధికారములోనున్న కాంగ్రెసు ప్రభుత్వమైనను తగు శ్రద్ధ వహించుటలేదు. మన ప్రభుత్వము శ్రద్ధతీసుకోనంతవరకు మనజాతి యీ పతనస్థితినుండి బయటపడుట కల్ల. మనము ఏకమై ఆరోగ్యసంఘములను స్థాపించి ప్రజారోగ్యమును గురించి ప్రభుత్వము శ్రద్ధ వహింపవలసినదిగా అందోళన చేయుట యెంతయు అవుసరము. ఆరోగ్యము లేని మానవుడు యేపనిచేయుటకు సమర్థుడు కాదన్న విషయము మనందరకూ తెలిసిన విషయమే: ప్రస్తుతము రష్యా తమ జాతిని బలాఢ్యులుగాను, వీర్యవంతులుగాను తయారు చేయుటకు యెంతయో శ్రద్ధవహించుచున్నది. మన ప్రభుత్వముకూడా యితర దేశములను ఆధారముగా తీసుకొని జాతిని ఆరోగ్యవంతముగాను, వీర్యవంతముగాను తయారుచేయుటకు కృషి చేయగలదని ఆశించుచున్నాను.

## భారతదేశ దుస్థితి

మనము యీ 150 సం॥ముల నుండియు దాస్యములోనుండుటవల్ల మన జాతియంతయు నిర్వీర్యమైనది. మనము యీ దాస్యమునుండి విముక్తి పొందవలయునన్న జాతిని బలాఢ్యులుగాను, వీర్యవంతులుగాను తయారు చేయుట యెంతయు అవసరము. మనజాతి యెంత నిర్వీర్యమైనదో యీక్రింది అంశముల వల్ల మీరు గ్రహింపగలరు.

న్యూజిలాండు బల్గేరియా దేశములలో సగటు జీవితము 67 సంవత్సరములు. అమెరికా, యూరప్‌లలో 50సంవత్సరములపైగావున్నది. జపానులో 40 సంవత్సరమునకుపైగా నున్నది ఇక మనదేశమో 23 సంవత్సరములు మాత్రమే. ఆహా! శాస్త్రజ్ఞులు మానవుని జీవితము 150 సంవత్సరములని నిరూపించిరి. అంటే మనము జీవింపవలసిన కాలములో 6 వ వంతు లోపు జీవించుచున్నామన్నమాట.

## మన యువకుల స్థితి

దేశమునకు వెన్నెముకలనదగిన యువకుల విషయము చూద్దామా మరీ అధ్వాన్నముగా నున్నది. ఒక్కయువకుని వద్దకూడ బొక్కెడు కండలేదు. యువకులలో దురభ్యాసములకు లోను కాని వారు మచ్చునకు పకరైనను కానరారు.

యువకులకు సిగరెట్లు, బీడీలు త్రాగుట, కాఫీ హోటళ్ళకు వెళ్ళుట ఒకఫాషన్ అయింది. వీటితోపాటు హస్తమైధున దురభ్యాసమునకు లోనుగాని యువకులు చాలా అరుదు. ఇందు యువకుల పొరపాటెంత మాత్రమూలేదు. మన విద్యా విధానములోనే. బాల్యమునుండియు వారికి యీ దురభ్యాసముల వల్ల యెంత నష్టమున్నదో బోధించేయెడల తప్పక వారిని యీ [illegible] సులభము. యిక యీ దురభ్యాసముల వల్ల కలుగు చెడులను గురించి తెలుసుకొనుట యెంతయు అవుసరము. పుగాకులోని కొటిన్ యను విషముకలదు. శాస్త్రీయమైన పద్ధతులతో పుగాకునుండి తయారుచేసిన యీ నికొటిన్ అనువిషమును ఒకచుక్క కుందేటిచర్మముమీద వేసినకుందేలు వెంటనే చనిపోవును ఇటువంటి విషం మానవునకు మాత్రమేల హానిచేయదు? ఈ నికొటిన్‌వల్ల హృదయము, ఊపిరితిత్తులు జీర్ణకోశావయవములు, నరములు బలహీనత చెంది మానవుని జీవితములో కొంతకాలమును తగ్గించునని శాస్త్రజ్ఞులు నిరూపించిరి.

కాఫీలో "కాఫియన్", టీలో "టానిన్". కోకోలో "కోకెయిన్" అను మాదక ద్రవ్యములు కలవు. ఇవికూడా శరీరమున కెంతయో హాని కలిగించును. వీటివల్లకూడా నరముల బలహీనత, హృదయ దౌర్బల్యము, అజీర్తి, మలబద్ధకము, అతిమూత్ర వ్యాధి వచ్చునని శాస్త్రజ్ఞులు నిరూపించిరి.

## యువకులలోని దురభ్యాసాలు

ఇక అన్నింటిని మించిన దురభ్యాసమైన హస్తమైధునమునుగురించి ఆలోచించిన మన శరీరములో యింద్రియముకంటె మించిన వస్తు వింకొకటి లేదని తెలుసుకొనుట యెంతయో అవుసరము. ఒక యింద్రియపు చుక్క 68 నెత్తురు చుక్కలకు సమానమని ధ్రువపరిచిరి. దీనినిబట్టి యింద్రియము యెంత విలువకలదో తెలుసుకొనవచ్చు. పల్లెటూరి యువకులకంటె బస్తీలలో చదువు విద్యార్థి యువకులు యీ దురభ్యాసమునకు అలవాటు పడుచున్నారు. దీనికి ముఖ్యకారణము దుస్సహవాసము. అసహజమైన ఆహారము, వ్యాయామము లేకపోవుట. ఈ దురభ్యాసమువల్ల బలమును కోల్పోవుటయేగాక నపుంసకత్వము, క్షయ, పాండురోగము మొదలైన రోగములెన్నియో సంభవించుచున్నవి. మన దేశము పురాతన ఔన్నత్యమునకు రావలయునన్న యువకులను దురభ్యాసములనుండి తప్పించి వీరికి వ్యాయామమునందు ఆసక్తి కలిగించుట యెంతయు అవుసరము. బలమునందు యువకులకు ఆసక్తి కలిగించగలిగిన యెడల యువకులను యీ దురభ్యాసములనుండి మరల్చుట యెంతయు సులభము.

## మన వ్రాతపత్రికలు


# గత సంవత్సరం ఆటల విషయంలో జరిగిన కుంభకోణం

— స్వామి

[రాష్ట్రంలో విద్యార్థి యువజన, బాలసంఘాలు స్థానికంగా అనేక వ్రాత పత్రికలను నడుపుచున్నాయి వాటివిషయం స్థానికంగా మాత్రమే. 'నవయుగ' ఈ వ్రాత పత్రికల ఉద్యమాన్ని ముందుకు తీసుకోనిపోవుటకు కృషిసల్ప నిశ్చయించింది. అందుకని విద్యార్థి, యువజన, బాలసంఘాలు నడుపు వ్రాత పత్రికలలోని ఆకర్షనీయమైన భాగాలను ఇచ్చట పునర్ముద్రించుతాం. తద్వారా స్థానికసంఘ కృషిని రాష్ట్ర వ్యాపితంగా ప్రచారంలో పెట్టుతాం. అందుకే యీ శీర్షిక నూతనంగా ప్రారంభిస్తున్నాం. వ్రాత పత్రికలను నడుపు ప్రతి సంఘములు తమ పత్రికలను 'నవయుగ' ఆఫీసుకు పంపకోరుతాం, ఒకే ప్రతిని తయారుచేయు సంఘాలకు అవసరమైన విషయాలు ముద్రించిన పిమ్మట వారి పత్రికను తిరిగి పంపుతాం.

వ్రాత పత్రికలను నడుపు అన్ని సంఘాలు తమ పత్రికలను పంపి యీ శీర్షికను నిర్వహించుటలో తోడ్పడ కోరుతాం.] — సంపాదకుడు

తిరువూరు విద్యార్థి ఫెడరేషన్ గత మూడు సంవత్సరాలనుండి 'విప్లవ విద్యార్థి' అనే మాస పత్రికను నిర్విఘ్నంగా నడుపుతూ వచ్చారు. సర్వాలంకారాలతో ఎంతో అందంగా తయారుచేయుట యీపత్రికయొక్క ప్రత్యేకత. 'విప్లవ విద్యార్థి' జూన్ సంచికనుండి విద్యార్థుల ఆటల విషయాలనుగూర్చి విద్యాయాధికార్లు వహించే 'శ్రద్ధను' బయలుపర్చే ఈ చిన్న వ్యాసాన్ని పునర్ముద్రించుతాం సంపాదకుడు



గత సంవత్సరము ఆటవస్తువులు మన స్కూలుకు తెప్పించలేదు. దీనివెనుక పెద్ద గాధయున్నది. యిక్కడి డ్రిల్లు మాస్టరు బడ్జెట్టు వేసి పంపగా బోర్డునుంచి నాలుగైదు నెలలకు శాంక్షన్ అయివచ్చింది. యిక్కడకు శాంపుల్సు అయిదారు అండ్ కోలవి రావాలి కాని న్యూ ఫ్రండ్స్ అండ్ కో [NFC] బెజవాడ స్పోర్ట్సువి (B. S) వచ్చాయి వీనిలో మంచివి డ్రిల్లు మాస్టరు రికమెండ్‌చేసి పంపాలి. కాని హెడ్ మాస్టరే ఆ పనిచేసి పంపారు. మనకు రెండు సంవత్సరములనుండి మరీదు అమృతం(స్థానిక వర్తకుడు) మంచివస్తువులు తక్కువరేటుకు యిస్తున్నాడు. ఈసంవత్సరము డ్రిల్లుమాస్టరు వాటినే మంచివనిబోర్డుకవ్రాశాడు. వెంటనేన్యూ ఫ్రండ్సుకురేట్సుతగ్గించి పంపాడు. ఫిజికల్‌యిన్‌స్పెక్టర్ అమృతంపంపిన వస్తువులు మంచివని చెప్పారు. కాని బోర్డునుంచి యన్. యఫ్. సి. వస్తువులు తీసుకొమ్మని వచ్చింది.

స్కూలు మూసేసే సమయానికి ఆర్డరు వచ్చింది. కాబట్టి ఆ వస్తువులు తీసుకోవద్దని ఫిజికల్ డైరక్టరు గేమ్సు మినిట్సు బుక్కులో వ్రాసారు. వెంటనే యన్. యఫ్. సి. నుండి ఆటవస్తువులుతీసుకవచ్చారు. డ్రిల్లుమాస్టరు వద్దన్నాడు. కంపెనీనుండి వచ్చిన మనిషి హెడ్ మాష్టరుతో చెప్పుకున్నాడు; అప్పుడు హెడ్ మాస్టరు వస్తువులు తీసుకోమని ఫిజికల్ డైరక్టరు డ్రిల్లుమాష్టర్లతో చెప్పారు. డ్రిల్లుమాష్టరు మినిట్సులో వద్దనివ్రాయుటచే తీసుకోనన్నాడు. అప్పటికి హెడ్‌మాష్టరు ఫిజికల్ డైరెక్టరు వ్రాసినది కొట్టివేసి వస్తువులను తీసుకోమని మినిట్సులో వ్రాశాడు. సేవింగ్సు బ్యాంకులో నుండి డబ్బు తీసుకోవలెను. కాని రైటరు ఆడిట్‌కువెళ్ళితే కష్టం. బోర్డునుండి యిప్పుడు వస్తువులు తీసుకొనవలెనో లేదో వస్తేనే బ్యాంకునుండి డబ్బుతీసుకుంటాను" అన్నారు. అది యింతవరకు రాలేదు.

ఇంత కర్మకాండ జరగడానికి ఏదో భూకంపం వుంటుంది. దీనికి వ్యక్తులమధ్య ఆర్థిక ఒడంబడికలే కారణమై యుండాలి. విద్యార్థులు యీసంవత్సరం ఆటవస్తువులు స్కూలు తెరచినప్పటినుండి అందించాలని ఆందోళన చేయాలిసివుంటుంది.

---

## ఫెడరేషన్ బులెటిన్

విద్యార్థి యువజనసంఘాల కార్యకలాపాలను, వివిధస్థానిక యూనిట్ల అనుభవాలను అందజేసే బులెటిన్ నెలకు 1టి గాని 2 గాని సంచికలు ప్రకటించ నిర్ణయించాం. ఆగస్టు నుంచి ప్రారంభమవుతుంది.

— విద్యార్థి యువజనసంఘాల కార్యక్రమాన్ని,
— ఏ విధంగా పనిచేస్తున్నది తెలుసుకోవాలన్న
— విద్యార్థి యువజనసంఘ కార్యకర్తలు ఎక్కువ అనుభవాన్ని గడించాలన్న
— అన్ని సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకోవాలన్న,
— బలమైన ఉద్యమాలను నిర్మించాలన్న

వెంటనే ప్రతి స్థానికసంఘం చందా దారులుగా చేరాలి,

| | |
|---|---|
| సంవత్సర చందా | రు 5—0—0 |
| అర్ధసంవత్సర చందా | రు 2—8—0 |

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషన్
ఆంధ్రరాష్ట్ర యువజన ఆర్గనైజింగు కమిటీ.

★

పాఠకలోకం

# మీ 'నవయుగ' అన్వర్థనామయై వర్థిల్లాలి

★

సుప్రసిద్ధ చరిత్రకారులు - సాహిత్యవేత్త శ్రీ మల్లంపల్లి ఆశీస్సులు

ఆర్యా,

నేనీనడుమ నెలా పదిహేనురోజులనుంచి మద్రాసులో లేను. పల్లెలలో తిరుగుతున్నాను. విన్ననే మద్రాసు చేరుకున్నాను. నేను వచ్చునప్పటికి మీ నవయుగ పత్రికలు రెండు మూడు సంచికలు వచ్చియున్నవి. వాటిని చూచి చాలా సంతోషించినాను.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి యువజనుల పక్షమున ఈ మాసపత్రికను నడుపుట ప్రశంసనీయమైన విషయము. మీ ఉత్సాహపూరితమైన కృషికి నా ఆశీస్సులు. మీ 'నవయుగ' దినదిన ప్రవర్థమానయై విద్యార్థిలోకమునకు శ్రేయస్సు సమకూర్చాలని నా యాశ.

ఈ సందర్భంలో నాకు తోచిన కొన్ని అభిప్రాయములు తెలుపుతున్నందుకు అన్యథా భావించరని తలుస్తాను :

1. యువజనోద్యమంలో కలిగిన చీలికలను గురించి మీరు వ్రాశారు. ఇట్టి చీలికలు కలుగుట చాలా శోచనీయమైన విషయం. స్వతంత్ర జీవనరంగంలోనికి ఇంకా దిగకముందే యువజనులలో ఇట్టిభేదాభిప్రాయములు కలిగితే భావిభారత స్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో చెప్పనక్కరలేదు. ఈ చీలికలను తొలగించి యువజనులలో ఐక్యత కలిగించుటకు మీసర్వశక్తులా పాటుపడుడని నాప్రార్థన.

2. మీరు చెడుగుడిని గురించి ప్రకటించారు. నాకు చాలా ఆనందం కలిగింది. మన జాతీయక్రీడ లిటువంటివి చాలా ఉన్నవి. ఇవి విజాతీయ క్రీడలకంటెను శరీరానికి బలమును, ఎక్కువ వ్యాయామమును ఇచ్చేవి. ఉప్పట్టి మొదలైనవి మీకు వేరే జ్ఞాపకం చేయడమెందుకు ? మన దేశంలో ఆంగ్ల విద్యనభ్యసించిన వారికీ, గ్రామ వాసులకూ క్రీడా జీవనము దగ్గర నుంచీ విభేద మేర్పడుట మనము తలవంచుకో వలసిన విషయము. ఇట్లని నేను విజాతీయ క్రీడలు కూడ వనను. వాటి నవలంబించిన మాత్రమున మన జాతీయ క్రీడలను నిరాకరింపవలసిన అగత్యములేదు. మన జాతీయక్రీడలలో అవసరమైన మార్పులు చేసి వాటిని విజాతీయ క్రీడల హోదాకు తెచ్చి వాటికి ప్రజాదరమూ, ప్రజానురాగమూ గడించాలి. అవసరమైన మార్పులుచేసి టోర్నమెంట్సుకు అనువైనట్లు దిద్ది ఈ జాతీయ క్రీడలను గురించి ఒక పుస్తకము ప్రకటించి వీటికి ప్రచారము కలిగించండి. చెడుగుడిని గురించి వ్రాసి మీరు ఈ ప్రచారానికి చక్కని ఆరంభం చేశారు. మీకు నా అభివందనములు.

3. మీరు కళలను గురించికూడా శ్రద్ధతో పూనిక వహించాలని నా కోరిక. జీవితం అనుభవయోగ్యంగా చేసేదే కళ. కళకు మన ఆదర్శాన్ని, ఆశయాన్నీ సమన్వయం చేయగల శక్తి ఉంది. కళ అంటే కుటీర పరిశ్రామిక కళకూడాను, జీవితానందం కళారూపంగానే వ్యక్తమవుతుంది.

ఇవే నేను చెప్పదలచినవి. మీ నవయుగ అన్వర్థనామయై వర్థిల్లాలి. నమస్తే.

— మల్లంపల్లి సోమశేఖరశర్మ.

## తృతీయ గుంటూరుజిల్లా పత్రికా రచయితల మహాసభ

★

తెనాలిలో జూలై, 27

అధ్యక్షులు :

శ్రీయుత చల్లా జగన్నాధంగారు.

ప్రారంభకులు :

శ్రీయుత కోటంరాజు రామారావుగారు.

## జనవరినుండి జూన్ వరకు నవయుగ కార్య కలాపముల కయినజమాఖర్చులు

| | | | |
|---|---|---|---|
| 1638 | 2 | 9 | విరాళాలు |
| 1524 | 7 | 0 | ఏజెన్సీలు |
| 764 | 0 | 0 | చందాదారులు |
| 464 | 1 | 6 | అప్పుతెచ్చినది |
| 180 | 0 | 0 | ప్రకటనలద్వార |
| 4570 | 11 | 3 | |

| | | | |
|---|---|---|---|
| బ్యాంకువిల్వ | 5 | 0 | 0 |
| ఆఫీసు | 178 | 7 | 6 |
| ఎస్టాబ్లిష్ మెంటు | 617 | 10 | 0 |
| ప్రయాణము | 276 | 2 | 6 |
| తపాలా డిస్పాచ్ | 314 | 3 | 0 |
| ప్రింటింగ్ | 1238 | 8 | 0 |
| కాగితము | 786 | 1 | 2 |
| అలవెన్సులు | 171 | 11 | 0 |
| అద్దె | 79 | 0 | 0 |
| బ్లాకులు | 441 | 7 | 6 |
| గ్రంధాలయం | 250 | 8 | 6 |
| అనామతు | 212 | 0 | 1 |
| మొత్తం ఖర్చు | 4570 | 11 | 3 |

★

## విరాళాల పట్టిక

| | | | |
|---|---|---|---|
| లోగడ ప్రకటించిన మొత్తం | 1633 | 0 | 9 |
| గొల్లపల్లి సుబ్రహ్మణ్యం | 1 | 2 | 0 |
| మన్నే నాగభూషణం | 2 | 0 | 0 |
| కోడూరి అప్పారావు | 1 | 0 | 0 |
| శ్రీ రామారావు | 1 | 0 | 0 |
| అనుమోలు వెంకటేశ్వరరావుగారి వివాహ సందర్భమున | 50 | 0 | 0 |
| కొల్లిపర విద్యార్థిసంఘం | 5 | 0 | 0 |
| యం. యస్. ప్రకాశరావు | 20 | 0 | 0 |
| | 1713 | 2 | 9 |

గుంటూరు
7-7-47

★

## నవయుగ చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సరానికి | 3- 0-0 |
| అర్ధ సంవత్సరం | 1- 8-0 |
| 3 మాసాలకు | 0-12-0 |
| విడిప్రతి | 0 -4-0 |

# పిల్లల నెలా పెంచాలి!

— డాక్టర్ జె. వి. లక్ష్మి,
ఎం. బి. బి. యస్.


[పిల్లల పెంపకాన్ని గూర్చిన విజ్ఞానం మన సమాజ అభివృద్ధికి ఎంతో అవసరం. కాని మన తల్లిదండ్రులకు యిట్టి విషయాలు అందుబాట్లోలేవు. పిల్లల పెంపకాన్ని గూర్చి శాస్త్రీయ దృక్పథంతో వ్రాసిన అనేక గ్రంథాలు ఇంగ్లీషులో యున్నవి. కాని మన ఆంధ్ర ప్రజల జీవితానికి అన్వయించి వాటిని వ్రాసిన వారు లేరు. తమ పిల్లలకు సరియైన అలవాట్లు నేర్పుటకు తోడ్పడునను ఉద్దేశ్యంతో యీ శీర్షికను ప్రారంభించుతున్నాం. ఈ శీర్షికలో జబాబులిచ్చుటకు పిల్లల పెంపకంలో తమను ఎదుర్కొను సమస్యలను "నవయుగ"కు తలిదండ్రులు వ్రాయమని ఆహ్వానించుచున్నాం. ఇట్టి ప్రశ్నలకు యీ శీర్షికలో డాక్టరు లక్ష్మిగారిచే జబాబులు వ్రాయించి ప్రచురించుతాం. సం॥]

ప్రాచీన సామాజిక వ్యవస్థ శిథిలమయి, పురాతన ఆచారములు, సాంప్రదాయములు మూలపడుచున్నాయి. నూతన సాంప్రదాయాలు వాటి స్థానాన్ని ఆక్రమించుకో ప్రయత్నిస్తున్నాయి. ఈ పాత క్రొత్త పోకడల సంఘర్షణ ప్రతి గృహములోను ప్రతిబింబిస్తున్నది. ప్రతి ఇంటిలోని ఈ ఘర్షణకు అమాయకులయిన బిడ్డలు ఆహుతి అయిపోతున్నారు. వృద్ధులు వారి ఆచారములకు, ఆశయములకు అనుకూలముగా బిడ్డలకు శిక్షణ యివ్వ ప్రయత్నించుతారు. యువకులు, నూతన దృక్పథంతో తమ పిల్లలను పెంచవలెనని తాపత్రయ పడుతారు.

సంఘమునకు ఉపయోగపడునట్లు పిల్లలను పెంచవలెనని, పిల్లల సమస్యలను అర్థం చేసుకొని ప్రతి పిల్లడికి తరిఫీదు యివ్వవలసి ఉంటుంది. ఆట వస్తువులలాగా గాలికి పెరగమని వదిలివేయడంకాక క్రమశిక్షణకు అలవాటు పెట్టాలి. ఈలాగని ప్రతి బిడ్డకి ఒకే విధమైన శిక్షణ వర్తించదు. వారసత్వాన్నిబట్టీ, పరిసరాల ననుసరించీ బిడ్డడికొక మనస్తత్వ ముంటుంది. దాని ననుసరించి శిక్షణ యివ్వాలి.

## పిల్లల ప్రశ్నలు

సాధారణంగా బిడ్డలకు వారి పరిసరాలలో ఉన్న ప్రతివిషయం గురించి అనుమానాలు, సంశయాలు కలుగుతూఉంటాయి. అవి తీర్చుకునేందుకు అనేకరకములయిన ప్రశ్నలు వేస్తారు. వాటిలో అర్థంలేకపోవచ్చు. హాస్యాస్పదంగా మనకు కనిపించవచ్చు. చుట్టూరా ఉండే ప్రపంచాన్ని అర్థంచేసుకోవాలనే ప్రయత్నంలో పిల్లలు యీ ప్రశ్నలు వేస్తారు. ఒక్కొక్కప్పుడు మనలను విసిగిస్తారు. అయినా చీదరతోను, చిరాకుతోను వారిని కేకలు వేయరాదు. అన్ని ప్రశ్నలకు ఓపికతో వారి కర్థమయే భాషలో జవాబులు చెప్పాలి. వారి సంశయాలను తీర్చాలి. సంతృప్తిని కలిగించే సమాధానాలు యివ్వాలి. అర్థంలేని ప్రశ్నలని, వారిని హేళన చేయకూడదు. చిరాకుపడి హేళన చేసినయెడల బిడ్డలు చిన్నపుచ్చుకుంటారు. హేళన చేస్తారనే భయం చేత మరి ప్రశ్నలడగడం మానివేస్తారు. సహజంగా వారిలోఉన్న పరిశోధనాశక్తిని, పరిశీలనా కుతూహలాన్ని ఈవిధంగా అణగ



ద్రొక్కినవారమవుతాం. పరిసర ప్రాంతాలలో, ప్రాపంచిక విషయములలో జోక్యం కలిగించుకోడం మానుతారు. మానసిక దుర్బలులుగా తయారయి పెద్దవారయినాక అనేక మానసిక రోగాలకు లోనవుతున్నారు.

ఈ పరిస్థితులకు దారి తీయకుండా మనోవికాసం గల పిల్లలు తయారు కావాలనిన, వారికి ఆహ్లాదం కలిగించే ప్రతివిషయంలోను మనంకూడా పాల్గొనాలి. వారిజీవితంలో మనం కూడా భాగస్వాములని వారు గుర్తించునట్లు మెలగాలి. వారి కష్టసుఖాలన్నింటిలోను మనం తోడ్పడుతామనే విశ్వాసం వారిలో కలిగించాలి. ఇటువంటి వాతావరణంలోనే ధైర్యంగా ప్రతి సమస్యలనీ ఎదుర్కొన గలిగిన యువకులు, యువతులు తయారవుతారు.

ఈ విషయం ముఖ్యంగా పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలోపడి, క్లబ్బులకు, పార్టీలకు షికార్లకు, సినిమాలకు ఉన్న కాలమంతా వినియోగిస్తూ పిల్లల్ని చూడటానికే తీరికలేకుండా ఉండే నవనాగరికులు బాగా గుర్తించాలి. బిడ్డలకు వారి నాగరికతలు అర్థంకావు. వారిని అర్థం చేసికొని, వారి సమస్యలన్నింటిలోను పాల్గొనే తల్లికావాలి. వారి కష్టసుఖాలను పంచుకునే స్నేహితురాలు కావాలి. ఆ విశ్వాసాన్ని వారిలో కలిగించి వారి మానసికశక్తులు ఎటువంటి ఆటంకమూ లేకుండా అభివృద్ధి అగుటకు అనుకూలమయిన వాతావరణము కల్పించాలి.

## పిల్లల ఆహారం

సాధారణంగా మనదేశంలో పిల్లల ఆహారం ఆరోగ్యం గురించిశ్రద్ధ తీసికోవడం అరుదు. వేళకు తిండి, నిద్ర ఉండదు. గృహములోని పెద్దల అలవాట్లను బట్టి బిడ్డల అలవాట్లుకూడా ఉంటాయి. శరీరమునకు పుష్టినిచ్చే ఆహారమా కాదా అనే ఆలోచనే ఉండదు. కారము, మసాలా సామానులు మొదలగు ఆరోగ్యమును చెడగొట్టే పదార్థాలేన్నో పిల్లలకుకూడా పెడతారు. మూడుపూట్ల తిండి తింటే సరి, దానితో సంతృప్తి పడతారు. పెద్దలు-పిల్లల ఆహారములో కారం, మసాలా సామానులు వాడకూడదు. చప్పిడి కూరలు వారి ఆరోగ్యమునకు క్షేమము. రుచిగా ఉంటేకాని పిల్లలు తినరనుకోడం పొరపాటు. చేయుఅలవాట్లను పట్టి పిల్లలు తినడం, తినకపోవడం ఉంటుంది. వారి ఆహారములో పళ్ళు, పాలు, కాయకూరలు ప్రధాన పాత్ర వహించేటట్టు చూడాలి.

కొంతమంది పిల్లలు వారికిష్టమయిన పదార్థము ఉంటేనేకాని భోజనము చేయమని మారాం పెడతారు. అలాంటప్పుడు, వారిని బలవంతం పెట్టి భోజనం చేయించకూడదు. భోజనం లేకుండా వదిలివేయాలి. రెండు దినాలు ఈ విధంగా చేసినయెడల కోరిన పదార్థాలు అందకపోగానే, తదితర పదార్థములు తినడం ప్రారంభిస్తారు. రుచిగా ఉందని హెచ్చు తినడం పిల్లలలో సహజంగా ఉన్న దుర్గుణం. దీనిని అరికట్టాలి. రాత్రిళ్ళు బరువయిన ఆహారం యివ్వడం మానాలి. దీ! వలన నిద్ర తిన్నగాపట్టక ఆరోగ్యం చెడుటకు అవకాశమున్నది. చీకటిపడకుండానే పిల్ల

(మిగతా 19 వ పేజీలో)

# బాలప్రపంచం



# - వీర -

మహాయుద్ధారి యుద్ధం వచ్చింది. లక్షల కొలదీ జనం చనిపోయారు. అమ్మ, నాన్న లేని పిల్లలు ఎందరో వున్నారు.

మన దేశం బానిస దేశం. అమ్మ, నాన్న లేని పిల్లల్ని పెంచే దిక్కు లేదు యిక్కడ. సోవియటు రాజ్యంలో అల్లా కాదు. అది ప్రజారాజ్యం. అక్కడ అమ్మ-నాన్న లేని పిల్లల్ని ప్రభుత్వమే పెంచుతుంది.

అనాధుల్ని పెంచడానికి సోవియటులో పెద్ద యిళ్ళున్నాయి. వాటి ఖర్చు అంతా ప్రభుత్వమే భరించుతుంది.

అంతేకాదు; అనేక కుటుంబాలు అనాధ పిల్లల్ని పెంచుతాయి. అమ్మ నాన్న లేని పిల్లలకి తమ ఇళ్ళల్లో తావిస్తారు. తమ హృదయంలో దాచుకుంటారు. వాళ్ళకి తామే అమ్మా - నాన్న అవుతారు.

అలాగే ఉమ్మడిగా వ్యవసాయం చేసే రైతులుంటారు. వాళ్ళు కలసికట్టుగా పంటలు పండించుతారు; పాడి చేస్తారు. వాళ్ళుకూడా అనాధ పిల్లల్ని పెంచుతారు. ఆ పిల్లల ఖర్చుల్ని ఉమ్మడిగా భరించుతారు.

వీళ్ళేకాదు. యువజన సంఘాలుంటాయే, వాటిని 'కాంసోమాల్సు' అంటారు. వాళ్ళుకూడా పిల్లల్ని పెంచుతారు. తామేమో యువకులవుతున్నారు. తమకంటే చిన్న తమ్ములు చిట్టి చెల్లాయిలూ, అమ్మ-నాన్న లేని వాళ్ళు. అలాంటివాళ్ళను యువజన సంఘాలు జాగ్రత్త తీసుకుంటాయి; పెంచుతాయి.

ఇలా అనాధులయిన పిల్లలను అందరినీ జాగ్రత్త తీసుకుంటారు. పోషించి పెంచుతారు. చదువు చెప్పించుతారు.



మామ్మతో వీర

పని నేర్పించుతారు. గొప్పవాళ్ళ య్యేలా చేస్తారు. అసలు అనాధలనే వాళ్ళే లేరన్న మాట, ఆ ప్రజారాజ్యంలో!

మనకూ కూడా అంచతక్కని రాజ్యం వుంటే ఎంతచక్కగా వుంటుంది! బ్రిటీష్వాణ్ణి తోలేద్దాము! మన దేశంలో కూడ అలాంటి రాజ్యాన్ని మనంకూడా కట్టుకుందామే!

మమ్మాయి 'వీర'

లెనిన్‌గ్రాడ్ యుద్ధం జరుగుతోంది. ఒకఫిరంగి గుండు వచ్చి వాళ్ళింటిమీద పడింది. ఇల్లు కూలి పోయింది. అమ్మ నాన్న యిద్దరూ చనిపోయారు. పిల్ల 'వీర' ఒక్కతే ఎల్లాగో బ్రతికింది.

పురపాలకసంఘం ఆపిల్లను జాగ్రత్త చేసింది. శరణాలయంలో చేర్చింది. 'వీర' అక్కడ పెరుగుతూంది. అమ్మ నాన్నను తలచుకొనేది పిల్ల. ఎప్పుడూ విచారంగా వుండేది.

ఆ నగరంలోనే 'యూరి' అనే పిల్లాడు చనిపోయాడు. చక్కనిపిల్లాడు. వాళ్ళమ్మ 'నీన' కొడుకుని తలచుకునేది ఎప్పుడూ ఏడుస్తూవుండేది. మామ్మ ఎంత సముదాయించినా వూరుకునేది కాదు.


మామ్మగారూ, అల్లుడు విక్టరూ ఒకటి ఆలోచించారు. 'నీనమ్మ' కొడుకుని మరిచిపోలేక పోతూంది. అందుకని ఇంకో చక్కటి పిల్లని పెంచుకుంటే 'నీనమ్మ' విచారం పోవచ్చు.

వాళ్ళందరూ కలసి శరణాలయంలోకి వెళ్ళారు. అధికారుల్ని అడిగారు 'వీర' ను వాళ్లింటికి తెచ్చుకున్నారు పెంచుకున్నారు.

'నీనమ్మ'ను వీర 'అమ్మా' అంటుంది విక్టరును 'నాన్నా' అని పిలుస్తుంది ముసలమ్మను 'మామ్మా' అని పిలుస్తుంది. వాళ్ళందరూ 'వీర' న 'మమ్మాయి' అని ముద్దుగా చెప్పుకుంటారు. ఇంకేం కావాలి!

ఈబొమ్మలు చూడు! వీర మామ్మగారి దగ్గర నిలుచుంది. పుస్తకంలో బొమ్మలు చూపించి నవ్వుతూంది.

నాన్న దగ్గర కూచుంది. పాఠం రాసుకుంటూంది. తెలియకపోతే నాన్నగారితో చెప్పించుకుంటోంది. మంచి పిల్ల అంటే అలావుండాలి!



వీర తండ్రితో

# అల్లీ - బిల్లీ

శ్రీ తెన్నేటి సూరి

అల్లీ బిల్లీ; రామన్నా,
అంతావాకతే భీమన్నా,
ఆలీ అల్లీ రంగప్పా,
అంతావాకతే వెంగప్పా! అల్లీ
పిల్లా జెల్లా, లే లెండీ!
కల్లా కపటం మానండీ,
పిల్లీ నల్లీ కాకండీ
బీతీ బిక్కూ వీడండీ అల్లీ
తియ్యాతీపుల కలకండా,
తెలుగుల దేశం నలగొండా
తెలుగుల నాడూ తెలంగణా
కలుముల వీడూ తెలంగణా అల్లీ
కయ్యంసాగిన తెలంగణా
కత్తుల్లేచిన తెలంగణా
బాలవీరులా తెలంగణా
బాకులు బట్టిన తెలంగణా అల్లీ
మీసం దువ్విన తెలంగణా
కూసం విడిచిన తెలంగణా
తెలుగు పరగణా తెలంగణా
తెలుపర ఢక్కా ధణంధణా అల్లీ
పయ్యెదలోపలి బాలుణ్ణో
ఉయ్యాలల్లో ఉంగణ్ణో
ఇమ్మల మాటల తమ్ముణ్ణో
ఆటల పాటల అమ్మణ్ణో
బళ్ళోకెళ్ళే బాలుణ్ణో
రంగుల పాటల రంగణ్ణో
రాజుల రోషం కసిరిందీ
నవాబు మీసం కరిచిందీ అల్లీ
పరంగి రాజును ముట్టెత్తీ
ఫిరంగి గొట్టం తెచ్చాడు
తెచ్చాడండీ తెచ్చాడూ
నవాబు సాహెబు వచ్చాడూ
వచ్చాడండీ వచ్చాడూ
నల్లగొండలో రెచ్చాడూ
రెచ్చాడండీ రెచ్చాడూ
తెలంగణాలో పెచ్చాడూ
నల్లగొండలో పెచ్చాడూ
నాళ్ళనడుమనే రెచ్చాడూ
తెలంగణాలో రెచ్చాడూ
తెలుగుల దేశం జొచ్చాడూ. అల్లీ
పరంగి రాజును ముట్టెత్తీ
ఫిరంగి గొట్టం తెచ్చాడు
తెచ్చాడండీ తెచ్చాడూ
ఫిరంగి గుండై పేలాడూ
నవాబు సాహెబు పెచ్చాడూ
నాళ్ళనడుమనే రెచ్చాడూ అల్లీ
పిల్లా జెల్లా లే లెండీ
కల్లా కపటం మానండీ
పిల్లీ నల్లీ కాకండీ
బీతీ బిక్కూ వీడండీ
బాకులు పట్టేదెవరండీ?
బాలకుమారులు లే లెండీ! అల్లీ బిల్లీ

---

(17 వ పేజీ తరువాయి)

భోజనాలు పూర్తికావాలి. పడుకునేముందు ఒక కప్పుపాలు యిస్తే సరిపోతుంది.

### అలవాట్లు

పెద్దలుచెప్పే మాటలూ, కథలూ వింటూ అర్ధరాత్రిదాకా మేలుకుండడం మన గృహాల లోని పిల్లలకు పరిపాటి. త్వరగా పడుకోడం పిల్లలకు ఆరోగ్యం. ఈ దురలవాటును మాని పించాలి. ఎన్నిపనులున్నా వెలుతురు ఉండ గానే పని పూర్తిచేసుకొనే అలవాటు చేయాలి. పాఠాలని వంకపెట్టి అర్ధరాత్రిదాకా మేలుకుండ డం సహించకూడదు. ఇదేవిధంగా పెద్దవాళ్లతో గాని, ఇతర పిల్లలతోకాని కలిసి ఒకే మంచం మీద పడుకోడం అలవాటు చేయకూడదు. ఎవరిప్రక్కలు వారికి ప్రత్యేకంగా ఉండాలి.

నిద్ర, పుష్టి అయిన ఆహారమునకుతోడు పిల్లలకు శరీర పరిశ్రమకూడా కావాలి. ఫుట్ బాల్, హాకీ, చెడుగుడు మొదలగు ఆటలు, తప్పనిసరిగా నడవడం అలవాటు చయాల. పెద్దలమాటలువింటూ ఆటలజోలికిపోక ఇంట్లో ఒకమూలకూర్చునే అభ్యాసాన్ని మాన్పించాలి. శరీరపరిశ్రమ లేకపోవడం ఆరోగ్యమునకు భంగం.

### సైన్సు విషయములు


యిక ఆఖరి విషయం. ప్రతి తల్లీ ముందో వెనుకో ఎదుర్కొవలసిన సమస్య సెక్సుకు సంబంధించింది. "పిల్లలు యే విధంగా పుడతారు" దీనికి సరియైన సమాధానం చెప్పక ఎంతోమంది తల్లులు తప్పించుకో ప్రయత్నిస్తారు. అబద్ధాలు చెప్పి సంతృప్తిపరచ ప్రయత్నిస్తారు. సెక్సుకు సంబంధించిన విషయాలను గురించి ప్రశ్నలు వేసినప్పుడు, రహస్యంగా చెవులో గొణుగుటో, లేక అసలు చెప్పకపోవడమో జరుగుతుంది. ఈ విధంగా యదార్ధము చెప్పక తప్పించుకొను టకు ప్రయత్నించినందున పిల్లల విశ్వాసాన్ని పోగొట్టుకుంటాము. తెలుసుకోవాలని కుతూ హలంతో అమాయకంగా పిల్లలు వేసే ప్రశ్న లకు, వారి అర్ధమగురీతిగా యదార్ధమునే చెప్పాలి. ప్రపంచాన్ని అర్ధం చేసుకొనేందుకు పిల్లలుచేసే అన్వేషణలో యిదికూడా ఒక భాగమే. కనుక వారి శంకలన్నిటికీ సమా ధాన మివ్వాలి. అబద్ధాలు చెప్పి వారి విశ్వాస మును పోగొట్టుకొనకుండా ప్రతి విషయము లోను యదార్ధమే చెపుతాము అనే భావము కలిగేటట్లు ప్రవర్తించాలి.

మనం చెప్పనందున పిల్లలు సెక్సుకు సంబంధించిన విషయములను గురించి ప్రస్తా వనను మానుతారనుకోడం వట్టి భ్రమ. మన ఎదురుగా భయముచేత ఆ ప్రస్తావన తేకపో వచ్చు. కాని ఇతరత్రా దొంగమార్గాలద్వారా విజ్ఞానము సేకరించుటకు ప్రయత్నిస్తారు. చెడ సహవాసాలు ప్రబలుతాయి. బహిరంగంగ యదార్ధము చెప్పినందువలన ఈ విజ్ఞానమునకు ప్రత్యేక విలువ కట్టడం మానేస్తారు. చెడ సహవాసాలకు దిగక మంచి చెడ్డలను ఎవరి అంతట వారే నిర్ణయించుకోగలశక్తి కలవా టవుతారు.

మన బిడ్డలు క్లిష్టతర మయిన సమ స్యలను ఎదుర్కొవలసి వుంది. ఆత్మవం చన లేకుండా, తన ఆశయాలకు తాను నిలబడ గల శక్తిని, స్వేచ్ఛను, వారిలో కలిగించుటకు యిప్పటినుండి పునాది రాళ్ళువేయాలి. ఆరోగ్యం గల పిల్లలను తయారు చేయుటద్వారా సంఘానికి మనబాధ్యతలను నెరవేర్చాలి.

విజ్ఞాన-విజయాలు

# తీగలు లేకుండా ఎలక్ట్రిక్ దీపాలు! బొగ్గు, పెట్రోలు లేకుండా మోటార్లు!



'రావు'

ఏప్రిల్ నెల సంచికలో సుప్రసిద్ధ సోవియట్ శాస్త్రజ్ఞుడు ఇలిన్ వ్రాసిన వ్యాసం చదివేవుంటారు. దానిలో సమాజాభ్యుదయానికి మానవుడు పరమాణుశక్తిలో ఎంతటి అద్భుత విజయాలు సాధించవచ్చునో ఆయన తెలిపాడు. అదే దృక్పథంతో సమాజానికి ఖర్చు తగ్గేవిధంగా పరమాణుశక్తితో విద్యుద్దీపాలు ఏలా వెలిగించుకోవచ్చునో, మోటారుకార్లు, లారీలు, ట్రాక్టర్లు వగయిరా ఎలా నడుపుకోవచ్చునో డా॥బర్టన్. డా॥ గామోవ్ అనే శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు.

ఇక ముందునుంచి మన ఇళ్ళల్లోను, వీధుల్లోను ఎలెక్ట్రిక్కు దీపాల సమస్య చాలవరకు తీరిపోతుంది. విద్యుచ్ఛక్తికోసం మున్సిపాలిటీల పవర్ స్టేషన్లమీద మనం ఆధారపడక్కర్లేదు. వీధులనిండా స్తంభాలుపాతి తీగలు గజిబిజిగా వూరంతా అల్లనక్కరలేదు. ఇవేవీ అవసరంలేకుండానే ఎలక్ట్రిక్ దీపాలు పెట్టుకోవచ్చు. పరమాణుశక్తి అందుకు మనకి చక్కగా ఉపయోగపడుతుంది. ఈ సాధనాన్ని డాక్టర్ మిల్టన్‌బర్టన్ అనే శాస్త్రవేత్త సూచిస్తున్నాడు.

అది ఏమీలేదు. పరమాణుశక్తితో ఒక కొత్తరకం ఎలక్ట్రిక్ బల్బును తయారు చేయడం.

మామూలు ఎలక్ట్రిక్ బల్బులను గురించి మనందరికీ తెలుసు. విద్యుచ్ఛక్తి సహాయంతో అవి వెలుగుతున్నాయి. వాటిలో భాస్వరం (ఫాస్ఫరస్) బల్బుల సంగతి తెలుసుకుంటే ఈ కొత్తరకం పరమాణు బల్బులను గురించి సులభంగా బోధపడుతుంది. ఎందుకంటే రెండూ ఇంచుమించు ఒకేసూత్రంపై నిర్మింపబడతాయి. అయితే భాస్వరం బల్బులలో ఏంజరుగుతుంది. బల్బులలో నింపబడే భాస్వరం గ్యాస్‌లోకి విద్యుచ్ఛక్తిని ప్రవహింప జేసినప్పుడు, లోనికి ప్రవహించే ఎలెక్ట్రానులవల్ల ఆ భాస్వరం కాంతినిస్తుంది. ఇప్పుడు డాక్టరు బర్టన్ కనిపెట్టిన బల్బులలో వేరే విద్యుచ్ఛక్తి అక్కరలేకుండా పరమాణుశక్తివల్లనే ఆ బల్బులు వెలిగేటట్లు చేయవచ్చు. పరమాణుశక్తినిచ్చే.... (ఎలిమెంట్సు)ను కూడా ఆ బల్బులోనే అమర్చిపెడతారు. మామూలుగా మనం లైటు వెలగడానికి స్విచ్ వేసినట్లుగానే దానికి కూడా, అవసరమైనప్పుడు ఆ పరమాణుశక్తిని వదిలిపెట్టేందుకు స్విచ్ లాంటి ఏర్పాటు వుంటుంది. అది వదిలితే బల్బు వెలుగుతుంది. మళ్ళీకట్టివేస్తే ఆరిపోతుంది. ఇదీ పద్ధతి. దీనివల్ల దీపాలకోసం, విద్యుచ్ఛక్తిని తయారుచేసే యంత్రాలు అక్కర్లేదు. తీగలు అక్కర్లేదు. మామూలు దీపంలాగే ఆ బల్బు ఎక్కడ కావాలంటే అక్కడ పెట్టుకుని వెలిగించుకోవచ్చు. ఎప్పుడు, ఏ వేళ కావాలంటే అప్పుడు వెలిగించుకోవచ్చు. దీనితో వ్యక్తికే కాకుండా సమాజానికంతకీ కూడా దీపాల సమస్య సులభంగాను, అతి చౌకగాను పరిష్కారమైపోతుంది.

పోతే ఇంకో ప్రశ్నవస్తుంది. ఈ బల్బులో అమర్చబడే ఎలిమెంటు ఎంతకాలం పరమాణుశక్తిని ఇస్తూవుంటుంది ? పరమాణుశక్తిని గురించి బాగా తెలుసుకున్న వారికీ సందేహం రాదు. అయినా డాక్టరు బర్టనే దీనికి కూడా సమాధానం చెబుతున్నాడు. ఒక్కసారి అలాంటి పరమాణుశక్తినిచ్చే ఎలిమెంటుతో నింపితే అది 25 మొదలు 1000 సంవత్సరాల వరకు కూడా పరమాణుశక్తిని ఇస్తూవుంటుంది. అంటే పగిలిపోకుండావుంటే కనీసం 25 సం॥ తక్కువ లేకుండా ఆ బల్బు ఉపయోగ పడుతుందన్నమాట.

## మోటార్లు నడిపే విధానం

అదే విధంగా పరమాణుశక్తి సహాయంతో మోటార్లు, లారీలు మొదలైన బండ్లను నడిపే విధానం డాక్టరు గామోవ్ అనే శాస్త్రజ్ఞుడు చెబుతున్నాడు. పరమాణుశక్తి వల్ల వేడి (హీట్) ని ఉత్పత్తి చేస్తారు. ఆ వేడి సహాయంతో మోటారు యంత్రాలు పనిచేస్తాయి. పైన చెప్పబడిన బల్బులో మాదిరిగానే దీనిలోకూడా పరమాణుశక్తినిచ్చే ఎలిమెంటును సిలెండర్లలో పెట్టి కారుకు అమరుస్తారు.

అయితే ఇక్కడ ఒక చిక్కువుంది. యీ పనికి ఇప్పుడు అటంబాంబులకు ఉపయోగించే యురేనియమ్‌నే ఉపయోగించడానికి వీల్లేదు. ఎందుకంటే ఇదివరకు అనుభవంలో యీ యురేనియంనుండి ఉద్భవమయ్యే పరమాణుశక్తితోపాటు కొన్ని ప్రమాదకరమైన రేడియో యాక్టివ్ శక్తులుకూడా బయలుదేరాయి. కాని డాక్టరు గామోవ్ దీనికి ఇంకో ఉపాయం చెబుతున్నాడు. కార్లు మొదలైనవాటిని నడపడానికి పరమాణుశక్తికోసం యురేనియమ్‌నే ఉపయోగించనక్కర్లేదు. ఇతర ఎలిమెంట్సును కూడా అందుకు వినియోగించుకోవచ్చు. అటువంటి ఎలిమెంట్సును శక్తివంతమైన కొన్ని రకాల రేడియేషన్‌కు గురిచేస్తే అవి పరమాణుశక్తిని ఇవ్వగలిగేవిగా తయారవుతాయి. ఇవి ఆశక్తి నిచ్చేటప్పుడు యురేనియమ్‌లోమాదిరిగా ప్రమాదకరమయిన ఇతర శక్తులేవీ ఉద్భవంకావు.

ఈ విధంగా ఆ ఎలిమెంట్సును పరమాణుశక్తి నిచ్చేటట్లుగా చేయడమనేది ఇప్పుడు కొత్తగా కనిపెట్టబడిన సైక్లోట్రాన్స్ అనే

మిగతా 22 వ పేజీలో



# విటమినులు

— డాక్టర్ యం. సి. హెచ్. రామలింగేశ్వరరావు
యం. బి. బి. యస్.

## విటమిను "బి₂"

దీనిని గురించి అన్ని విషయములు బాగా తేలలేదు. దీనిని నికొటానిక్ యాసిడ్ అను పేరుతో వ్యవహరిస్తారు. ఇదికూడ చాల అవు సరమైన పదార్థము.

దీని కొరతలో చర్మము ఎండి, ఎఱ్ఱబడి, నల్లబడి, సూర్యరశ్మి తగులు స్థలములలో పగులువారును. నోరు తరుచుగా పూయును, విరోచనములు పలుచగా నెక్కువగా నగును. ఈ జబ్బును పెల్లగ్రా (Pellagra) అని అంటారు. ఈ విటమిను యీస్టులో ఎక్కువగా నుండును. తయమిన్‌వలెగాక యీ నికొటానిక్ యాసిడ్, గ్రుడ్లు, పాలు, మాంసము వగైరాలయందు ఎక్కువగా వుంటుంది. పండ్లలోగూడ గలదు. ఆకుకూరలుకూడ మంచిదే. రక్తపుపోటు యెక్కువైన వారికి కూడ యిది మంచిది.

## రైబోఫ్లేవిను (Riboflavin)

దీనినే కొందరు లాక్టోఫ్లేవిను అని అందురు. ఇది తక్కువైనప్పుడు నోరు తరుచుగా పూయును. నోటి మూలలు ఎప్పుడూ పగిలి పూసివుంటాయి. ఇది నికొటానిక్ యాసిడ్‌తోపాటు చేరియుంటుంది. కంటినరముల జబ్బులకు, కొన్ని యితర కంటివ్యాధులకు కూడ యిది బాగా వుపయోగించునట్లు తోస్తూంది.

## ఫాంటోథీయక్ యాసిడ్ (Pantotheic acid)

ఇది మిగిలిన వాటితో కలిసి వుంటుంది. దీనిని గురించి ఎక్కువగా యింకను తెలియలేదు. ఎప్పుడూ వుండు అరికాలి మంటలకు వుపయోగంగా వుంటుంది. (Burning feet)

## విటమిను "సి"

దీనిని ఎస్కార్బిక్ యాసిడ్ అంటారు. (Ascorbic acid). ఇది తక్కువైన ఏర్పడు జబ్బును స్కర్వీ అని పిలుస్తారు. దానిని నయముచేయును గనుక దీనికి ఎస్కార్బిక్ యాసిడు అని పేరుపెట్టారు.

ఇది తాజా పండ్లలోను, కాయకూరలలోను వుంటుంది. పప్పులలో మామూలుగా వుండదు. కాని వానిని నీటిలో నానపోసి మొలకెత్తనిచ్చినచో ఆ సమయములో విటమిను "సి" అందులో ఏర్పడుతుంది.

* పప్పులుగాని, గోధుమలుగాని, బఠాణీ గింజలుగాని తీసుకొని గం॥ 24 లు నీటిలో నానవేయాలి. తరువాత వానిని తీసి తడి కంబళీమీద ఆరబోసితడిగుడ్డలేకగోనెకప్పాలిఅప్పుడప్పుడు నీటిని చల్లి పైగుడ్డను తడిగా, అట్టిపెట్టాలి. రెండు మూడు రోజులలో గింజలు మొలకలెత్తుతాయి. వాటిని పచ్చివిగానే తినాలి. లేని ఎడల 10 నిమిషములసేపు మించకుండా వండి తినవచ్చును. మొలకెత్తు పప్పులలో 100 గ్రాములకు 10-15 మిల్లిగ్రాములు విటమిను ఏర్పడుతుంది.

పండ్లు, కూరలు తాజాగా నున్నప్పుడే యీ "సి" విటమిను ఉంటుంది. నారింజ, బత్తాయి నిమ్మ, కమల, దబ్బ వగైరాలు, పచ్చిమామిడి కాయ చాల మంచివి. అన్నిటికంటే వుత్తము మైనది ఉసిరికాయ. (ఆమలకము) నారింజ రసముకంటె 20 రెట్లు ఎక్కువ విటమిను యీ ఉసిరికాయ రసములో వుంటుంది. ఒక్క పెద్ద వుసిరికాయలో రెండు మూడు నారింజ కాయలలో నున్నంత "సి" విటమిను వుంటుంది. ఈ విటమిను ఏండ్లు ఎండినను లేక కూరలు వెచ్చబెట్టినను ఆహారపదార్థముల నుండి వెళ్ళిపోతుంది. కాని వుసిరికాయలో వుండు పులుపుచేత యీ రెండు విధములకూడ ఎక్కువ నష్టము లేకుండా వుంచబడుతుంది. కొందరు పెద్ద వుసిరికాయలను తరిగి, ఎండబెట్టి పొడిగొట్టుతారు. గ్రాము పొడికి 10-15 మిల్లిగ్రాముల విటమిను "సి" వుంటుంది. ఈ పొడినిల్వవున్నకొద్దీ విటమిను "సి"నష్టమౌతుంది అయినాయిది మిగతావాటి అన్నిటికంటె చాలమంచిది. కొందరువరుగుగాచేసికొంటారు. కొందరు వీటిని వేడినీటిలో కడిగి ఉప్పులో వేసి వూరగాయ వేసికొంటారు. వీటిని నీటిలో వేసి నీటిని మరుగకాయరాదు ఏ మాత్రము వేడి ఎక్కువైనను యీ "సి" ఎగిరిపోతుంది.

ఇది తక్కువైనపుడు సూక్ష్మజీవులచే యేర్పడు అంటు వ్యాధులనుండి కాపాడుకొను బలము శరీరమునకు తగ్గిపోవును. అందుచే తరచుగా అంటువ్యాధులు కలుగుచుండును. రోజూ ఉసిరికాయ ఊరగాయ వేసికొనుటగాని, పొడి తినుటగాని చాల మంచిది, మన దేశంలో దీని విషయము చాల రోజులనుండి తెలిసియే యున్నది. త్రిఫలములలో నొక్కటై చాలా ఆయుర్వేదౌషధములలో నిదిగూడ చేర్చబడి యున్నది.

మనిషి ఒక్కనికి రోజుకు 30 నుండి 50 వరకు మిల్లిగ్రాముల విటమిను "సి" అవుసరమని తెలుస్తుంది. వండుటచే, ముఖ్యంగా మరికొంతసేపు వండుటచే యిది కొరత బడిపోతుంది. ఐనా కొంచెం పండ్లరసముగాని, లేక ఆకుకూరలుగాని చేరిస్తే యీ కొరత యేర్పడకుండా చూసుకోవచ్చును.

కాచిన, పోతపాలుపోసి పెంచబడిన చంటిపిల్లలకు పండ్ల (నారింజ, కమల, బత్తాయి) రసమునిచ్చి యీ విటమిను సరిపోవునటుల చూడవలెను. లేనియెడల మోకాళ్ళవద్ద, మోచేతులవద్ద యెముకలు వాయుట మొదలగునవి జరుగును. (Infantile Scury) మామూలు ఎదుగుకూడ వుండదు.

ఈ విటమిను కొరతలో సూక్ష్మరక్తనాళములలో బలముతగ్గి రక్తము స్రవించును. అందుచే పంటిచిగుళ్ళు వాచి, వానిలోనుంచి రక్తము కారును. చర్మముక్రింద రక్తము కూడి చిన్నచిన్న పొక్కులుగాగాని గడ్డలుగాగాని యేర్పడుతుంది. అవయవముల లోపల

* దీనిని "మాల్టింగు" లేక మాల్టుజేయుట అంటారు. రాగులను యీ విధముగాచేసి అరబెట్టి పొడిచేసినచో రాగిమాల్టు పానీయముగా దినము వాడవచ్చును. శరీరమునకు ఆరోగ్యకరము.

గూడ యీ రక్తస్రావమే యేర్పడవచ్చును. చంటిపిల్లలకి జబ్బులో పొడుగుపాటి యెముకల చివరలయందు వాపుయేర్పడి, యెముకలను అచోట ముట్టినంతనే బాధ యేర్పడుతుంది. దీనిని స్కర్వీ (Scurvy) అందురు. దీనిని తీర్చుటకు ఉసిరికాయ తర్వాత నిమ్మకాయ రసం చాలా ఉపయోగకారి. చాలా చవుకకూడాను.

### విటమిను "డి"

ఇది లివరునందు,చేప లివరు నూనెలందు, గ్రుడ్డులోని పసుపుపదార్థంలో, పాలు, పాల నుండి తీయు క్రొవ్వుపదార్థములలో నుండును.

ఇదిలేని యెడల కాల్షియం అహారం నుండి రక్తములోనికి ప్రవేశించుట బాగాజరుగదు. అందుచే రక్తములో కాల్షియం కొరతయేర్పడును. అందుచేత రికెట్సు, ఆస్టియో మలేషియా అను జబ్బులు యేర్పడును. ఈ రెంటిలోను ఎముకలయందలి కాల్షియం తగ్గి గట్టితనముపోయి అవి వంకరలు తిరుగును చిన్నతనములో కాళ్ళు వంకరలు తిరుగుట (దొడ్డికాళ్ళు) రొమ్ముగూడు చిన్నదై వంకర యెముకలతో యేర్పరుపబడును. పిల్లలు సరియైన వయసున తలయెత్తి, కూర్చుని, నుంచుని, నడచుట జరుగవు. గర్భవతులకు గర్భస్థ శిశువు ప్రత్యేకించుకొనుటతో కాల్షియం కొరత యేర్పడవచ్చును. అపుడుకూడ యెముకలు వంకర పోవచ్చును.పెద్దవారిలో వచ్చు జబ్బును అస్టియో మలేషియా (Asteomalacia) అనియు, చిన్నవారిలో వచ్చు జబ్బును రికెట్సు (Rickets) అనియు పిలుస్తారు.

ఇది రసాయనికముగా కాల్సిఫెరాల్ (Calciferol) అని పిలువబడుతూంది. దీనిని శరీరము తయారుచేసుకోగలదు. చర్మమునకు సూర్యరశ్మి తగిలినపుడు అందులో మామూలుగానుండు ఒకానొక పదార్థము విటమిను "డి" గా మారుతుంది. అందుచే యీ విటమినులోపం సూర్యరశ్మి బాగుగా లభ్యంగాని యూరపు మొదలగు భూభాగములందు, ఎక్కువ తరుచు. మన దేశమునందు పర్దా వేయు ఘోషాస్త్రీలలోకూడా కలుగవచ్చును. ప్రతిదినము కొంతసేపు ఆతపస్నానము చేయుట మంచిది.

ఈ విటమిను కొరత చిన్నతనములోనే వచ్చినయెడల వచ్చు పండ్లు గట్టిగా నుండవు. పండ్లపైని డెంటిను అను తెలుపు పదార్థము బలముగా నుండదు. పిప్పిపళ్ళుకూడ యేర్పడును.

"ఎ" "డి" విటమినులకు ముఖ్యమైన పదార్థము కాడ్లివరాయిలు, షార్కులివరాయిలు, ఎడాక్సిలినులు.

### విటమిను "ఇ"

ఇది మొలకెత్తు గోధుమలలో నుండును. దీనిని Wheatgerm oil అంటారు. దీనిలోపం మన దేశంలో చాలా అరుదు. దానివలన స్త్రీలకు గర్భం రాకుండుట లేక తరుచు గర్భస్రావం గలుగుట జరుగుతాయి. పురుషులకు దీనికొరత వుంటే పురుషాంగ భాగము బాగావృద్ధి పొందక సంతానము కలుగదు.

### విటమిను "కె"

ఇది కామెర్లలోను, యితరత్రికలుగు సూక్ష్మ రక్తనాళములనుండి జరుగు రక్తస్రావమును అరికట్టును. ఇది విటమిను "సి"తో కలసి సిట్రసు పళ్ళలో (నిమ్మ, నారింజ, దబ్బ, బత్తాయి) వుంటుంది.

### విటమిను "పి"

ఇదియు ఎస్కార్బిక్ యాసిడ్‌తో కలిసి వుంటుంది. స్కర్వీ కొన్ని రక్త స్రావములకు విటమిను "సి" మాత్రమిచ్చిన చాలదు. విటమిను "సి" యిచ్చినగాని లేక నిమ్మకాయ రసము నిచ్చినగాని కట్టును.

### రక్షక పదార్థములు (Protective Foods)

మామూలుగా శాకాహారులకు, బీద తరగతిలోని మిశ్రమాహారులకును అన్ని విటమినులు తగినంత దొరకక పోవచ్చును. పైన చెప్పిన వ్యాధులన్నీ మన ప్రాంతములలో తరుచుగా చూచుచునే వున్నాము. ఇట్టి వివిధ విటమినుల లోపము రాకుండచూచుకొనుట అత్యవసరము. అందుచే ఏ విటమిను అందులో ఎక్కువ వున్నది అను విషయం అవసరమే అయినను, ఆకుకూరలు, పండ్లు, గ్రుడ్లు, చేపలు, మాంసము మొదలగునవి అన్నీ సాధారణ విటమినులు కలిగియుండుటచే యే విధమైన కొరత రానీయక ఆరోగ్యము సరిగా కాపాడుతాయి. అందుచే వీటిని రక్షకాహారములంటారు. సాధారణ మానవుడు తన ఆహారములో దినము యేదో ఒకటి రెండు యీ రక్షకాహారములను చేర్చినచో, ఆహారం ఆరోగ్యమునకు సమమై (Balanced) వుంటుంది. ఇవి ప్రత్యేకముగా సమాజములో తరుచు బాధితులగు పసిబిడ్డలు, ఎదుగు పిల్లలు, చూలింత బాలింతలు ప్రత్యేకముగా వాడవలసిన అవసరం వుంది.

★

## ఆసియాదేశాల యువజన మహాసభ

★

ఇండోనేషియా—నవంబరు 7 నుండి20 వరకు

ప్రపంచ యువజనసమితి ఆసియాదేశాల యువజన మహాసభ నవంబరు నెలలో 7 నుండి 20 వరకు ఇండోనేషియాలో, 'మాదియోన్' అనేచోట జరుగుతుంది. ఈ సభకేర్పాట్లు చేయుటకుగాను, ఇండోనేషియా యువజన నాయకుడైన సోరిప్నో అధ్యక్షతను ఆహ్వానసంఘం యేర్పడింది. ఇండోనేషియా అధ్యక్ష, ఉపాధ్యక్షులైన సోకర్నో, హట్టాగార్లు ప్రధాని షారీర్ యీ కమిటీలో గౌరవసభ్యులు. సభాస్థల సమీపంలో ఒక యువజన క్యాంపు నిర్మించడానికని 8 వేల రూపాయలు ప్రత్యేకించారు. సభానంతరం ఆక్యాంపు ఇండోనేషియాలో ఒక ఆదర్శ గ్రామంగా మార్చాలను కుంటున్నారు.

అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ భారతదేశంనుండి పెద్ద, ప్రాతినిధ్య దళాన్ని పంపుటకు ఏర్పాట్లు చేయుచున్నారు.

(20 వ పేజీ తరువాయి)

యంత్రంద్వారా సాధ్యమవుతుందని డాక్టర్ గామోవ్ అంటున్నాడు.

అన్నీ బాగానే వున్నాయిగాని ఇవన్నీ మనకి ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి ? అని మన వాళ్ళంతా అడుగుతారు. దానికి సమాధానం మనలోనే వుంది. సమాజంలో పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద పెత్తనం వున్నన్నాళ్ళూ ఇవన్నీ మన చేతికి అంతసులభంగారావు. వాళ్ళు ఇలాంటి కొత్త పరిశోధనలన్నిటినీ తమ పెత్తనం, దోపిడీ కొనసాగించుకోడానికి, సుస్థిరంచేసుకోడానికి ఎంతవరకు ఉపయోగపడతాయా అనే చూస్తారు. అంతవరకే బైటికి తీసుకువస్తారు. అందుచేత మనలో ప్రతి ఒక్కరూ ఈ పెట్టుబడిదారీ దోపిడీ ప్రభుత్వాలను, సామ్రాజ్యవాదాన్ని కూలదోయడానికి ఎప్పుడు ముందుకొచ్చి, ఎంతత్వరగా విజయం సాధించి నిజమైన ప్రజా ప్రభుత్వాలను నెలకొల్పుకుంటామో అంతత్వరగా ఇలాంటివన్నీ మనకి లభ్యమవుతాయి. మన జీవితం సుఖప్రదమౌతుంది. ఏమంటారు ?